


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 300 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు శుక్రవారం 3 జూలై 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :300 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE FRI 3 JULY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## రెండు, మూడు నెలల్లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం

- అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు స్థిరంగా కొనసాగడమే ఇందుకు కీలకం
- పాత నిల్వలు అధిక ధరకు కొన్నందున కంపెనీలకు భారీ నష్టాలు
- ఇప్పటికే పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 తగ్గించిన నయారా ఎనర్జీ
- ఇప్పటికే తగ్గిన కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధరలు



పెన్ పవర్ డెస్క్:వాహనదారులకు ఊరటనిచ్చేలా కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి కీలక సంకేతాలిచ్చారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు ప్రస్తుత స్థాయిలోనే స్థిరంగా కొనసాగితే, రాబోయే రెండు, మూడు నెలల్లో దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం

- మిగతా 2లో

## వాళ్ల డ్రామా చూస్తుంటే బిగ్ బాస్ షో చూస్తున్నట్టుంది

- గురుకుల టెండర్లపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య సవాళ్ల పర్వం
- గన్ పార్క్ వద్ద బహిరంగ చర్చకు కాంగ్రెస్ మంత్రుల పిలుపు
- బయలుదేరిన బీఆర్ఎస్ నేతలను మార్గమధ్యంలో అడ్డుకున్న పోలీసులు
- ఇదంతా బిగ్ బాస్ షో అంటూ బీజేపీ నేత బండి సంజయ్ విమర్శ

- మిగతా 2లో



## అమెరికాతో వాణిజ్య ఒప్పందం.. పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు

- భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం చర్చలు తుది దశకు చేరాయన్న గోయల్
- 99 శాతం చర్చలు పూర్తయ్యాయని తెలిపిన కేంద్ర మంత్రి
- టారిఫ్ ప్రయోజనాలపై చట్టపరమైన అంశమే చివరి అడ్డంకి అని వెల్లడి
- చైనా, ఆగ్నేయాసియా దేశాల కన్నా భారత్‌కు ప్రాధాన్యత కల్పించడమే లక్ష్యం

- మిగతా 2లో



### శివరాజ్ సింగ్, చంద్రబాబు, పవన్ చేతుల మీదుగా...

## ఏపీ నుంచి దేశవ్యాప్తంగా 'వీబీ జీ రామ్ జీ' పథకం ప్రారంభం

ఏపీలోని రైల్వే కోడూరు నుంచి 'వీబీ జీ రామ్ జీ' జాతీయ పథకం ప్రారంభం

- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, చంద్రబాబు, పవన్ చేతుల మీదుగా ఆవిష్కరణ
- చారిత్రాత్మక ఘట్టానికి వేదికగా నిలిచిన ఏపీ



కార్యక్రమంలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.

ఆంధ్రప్రదేశ్ మరో చారిత్రక ఘట్టానికి వేదికైంది. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకం 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవికా మిషన్' (వీబీ జీ రామ్ జీ) ఏపీ నుంచే ప్రారంభమై దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. తిరుపతి జిల్లా రైల్వేకోడూరులో జరిగిన కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ బృహత్తర పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు.



### లబ్ధిదారులకు జాబ్ కార్డుల పంపిణీ



### గీతం ఆవిష్కరణ, పోర్టల్ ప్రారంభం



రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ముక్కవారిపల్లి గ్రామంలో రూ.4.55 లక్షల వ్యయంతో ప్రతిపాదించిన మూడు పనులకు నేతలు శ్రీకారం చుట్టారు. సామాజిక వర్షపు నీటి సంరక్షణ కుంట, మ్యాజిక్ డ్రెయిన్, మొక్కల పెంపకం కార్యక్రమాలను వీబీ జీ రామ్ జీ మిషన్ కింద తొలి పనులుగా ప్రారంభించారు. అనంతరం స్థానిక లబ్ధిదారులకు కేంద్ర మంత్రి, సీఎం, డిప్యూటీ సీఎం కలిసి జాబ్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, కమలేష్ పాశ్వాన్ కలిసి పథకం ప్రోత్సాహక గీతాన్ని ఆవిష్కరించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పథకానికి సంబంధించిన సమాచార బుక్‌లెట్‌ను, ఇతర ప్రచురణలను విడుదల చేయగా, నేతలంతా కలిసి పథకం అధికారిక పోర్టల్‌ను ప్రారంభించారు.



## నాకు చాలా టఫ్ బాస్ ఉన్నారు

### శ్రీసిటీ వర్సిటీ ప్రారంభోత్సవంలో నారా లోకేశ్

- శ్రీసిటీలో అంతర్జాతీయ విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి లోకేశ్
- 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యమని ఉద్ఘాటన
- వర్సిటీ ద్వారా 75 వేల ఉద్యోగాలను సృష్టిస్తామని వెల్లడి
- పెట్టుబడిదారులకు 3ూ మోడల్‌తో పూర్తి భరోసా ఇస్తున్నామని వివరణ
- ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త సీఎం టార్గెట్ అని స్పష్టం

పెన్ పవర్ డెస్క్:తమ ముఖ్యమంత్రి చంద్రబాబు చాలా కఠినమైన బాస్ (టఫ్ బాస్) అని, ఆయన కన్న కలలను సాకారం చేసేందుకు తమను నిరంతరం పరుగులు పెట్టిస్తున్నారని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపించాలన్న బలమైన ఆకాంక్షతో ఆయన పనిచేస్తున్నారని, అందుకు అనుగుణంగా తామంతా అదే వేగంతో పనిచేయాల్సి వస్తోందని అన్నారు.

- మిగతా 2లో

## నేను చదివిన ఆర్థికశాస్త్రం కంటే సమాజమే ఎక్కువ నేర్పింది: సీఎం చంద్రబాబు


- ఎకనమిక్ ఇంటెలిజెన్స్ ఫర్ గవర్నెన్స్ కెపాసిటీ బిల్డింగ్‌పై తిరుపతిలో వర్క్ షాప్
- ప్రజల జీవితాల్లో మార్పే అభివృద్ధికి అసలైన కొలమానం అని చంద్రబాబు స్పష్టీకరణ
- అమరావతిలో త్వరలో క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు చేస్తామని ప్రకటన
- ఏపీ ప్రభుత్వ విధానాలను ప్రశంసించిన కేంద్ర ఆర్థిక సలహాదారులు

- మిగతా 2లో

## వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం... ఉత్తరాంధ్రకు వర్షసూచన

- రానున్న 2-3 రోజుల్లో అల్పపీడనం మరింత బలపడే అవకాశం
- ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా
- తీరం వెంబడి గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు
- పలు జిల్లాలకు వర్ష సూచన జారీ

- మిగతా 2లో



## క్రాంతి కుమార్ కుటుంబానికి అండగా ఉంటాం

- ఆత్మహత్య చేసుకున్న దళిత యువకుడు క్రాంతి కుమార్ కుటుంబాన్ని పరామర్శించిన జగన్
- పోలీసు వేధింపుల వల్లే క్రాంతి మృతి చెందాడని ఆరోపణ
- సీఎం రక్షణ వల్లే దోషులు తప్పించుకుంటున్నారని జగన్ విమర్శ
- బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడతామని హామీ

పెన్ పవర్ డెస్క్:విజయవాడలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న దళిత యువకుడు క్రాంతి కుమార్ కుటుంబాన్ని వైసీపీ అధినేత జగన్ గురువారం పరామర్శించారు. క్రాంతి కుమార్ భార్య, పిల్లలు, తండ్రిని ఓదార్చిన జగన్, వారికి న్యాయం జరిగే వరకు తమ పార్టీ అండగా నిలిచి పోరాడుతుందని భరోసా ఇచ్చారు.అనంతరం మీడియాతో మాట్లాడిన జగన్.. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందనడానికి

- మిగతా 2లో



## ఏపీకి నేను మేనమామను... మేనమామ ఎప్పుడూ ఉత్త చేతులతో రాడు

### కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

- చంద్రబాబు, పవన్‌తో కలిసి వీబీ జీ రామ్ జీ పథకాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి
- రాష్ట్రానికి 74,212 పక్కా ఇళ్లు, రోడ్లకు రూ.422 కోట్లు ప్రకటించిన చౌహాన్
- వీబీ జీ రామ్ జీ కింద ఏపీకి 9 నెలల్లో రూ.7,700 కోట్లు విడుదల చేస్తామని హామీ
- మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద తోతాపురి మామిడి కొనుగోలుకు అంగీకారం

- మిగతా 2లో



## రాజకీయాల్లోకి స్టార్ హీరో సూర్య.. నిజమెంత?



- స్టార్ హీరో సూర్య రాజకీయ ప్రవేశంపై జోరుగా ప్రచారం
- అభిమాన సంఘం ప్రతినిధి వ్యాఖ్యలతో మొదలైన ఊహాగానాలు
- సోషల్ మీడియాలో వైరల్ అయిన వార్తలను ఖండించిన సూర్య టీమ్
- ప్రస్తుతానికి రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం లేదని స్పష్టీకరణ
- సేవా కార్యక్రమాలకు, రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదని వెల్లడి

2లో

## అమరావతిపై జగన్ మరో డ్రామా.. రాష్ట్ర భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు



పెన్ పవర్ డెస్క్:అమరావతిపై వైసీపీ అధినేత జగన్ చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా గందరగోళంగా ఉన్నాయని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. ఒకప్పుడు అమరావతికి మద్దతు తెలిపిన జగన్, తర్వాత

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

## బీజేపీలో నెక్స్ జన్ లీడర్ షిప్...

భారతీయ జనతా పార్టీ లో ఊహించని రీతిలో సమూల ప్రక్షాళనకు తెరలేపింది. కేవలం కేంద్ర మంత్రివర్గంలోనే కాదు.. అటు పార్టీ సంస్థాగత నిర్మాణంలోనూ పెను మార్పులు తీసుకురావాలని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ద్వయం గట్టి పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ప్రధాని మోదీ, అమిత్ షా తర్వాత ఢిల్లీ బీజేపీలో అత్యంత శక్తివంతమైన చక్రం తిప్పుతున్న జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ ను ప్రస్తుత బాధ్యతల నుంచి పక్కన పెట్టే ఆలోచనలో అధిష్ఠానం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. సుదీర్ఘ కాలంగా పార్టీ అంతర్గత వ్యవహారాలను, టికెట్ కేటాయింపులను, ఎన్నికల వ్యూహాలను శాసిస్తున్న ఆయనను తిరిగి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మాతృ సంస్థకు పంపేందుకు తెరవెనుక ముమ్మర కసరత్తు జరుగుతోందని ఢిల్లీ రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది.బీఎల్ సంతోష్ ను మార్చడం కేవలం ఒక వ్యక్తిని మార్చడం కాదు, ఇది రాబోయే 15-20 ఏళ్ల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని బీజేపీ వేస్తున్న ఒక చారిత్రాత్మక అడుగు. ప్రస్తుతం 70 ఏళ్ల వయస్సుకు చేరువవుతున్న సీనియర్ నేతల స్థానంలో, సాంకేతికతపై పట్టు ఉండి, మారుతున్న యువ భారతదేశ ఓటర్ల నాడిని పట్టుకోగల నెక్స్ జనరేషన్ లీడర్లను కీలక స్థానాల్లో కూర్చోబెట్టాలని మోదీ-షా భావిస్తున్నారు. పార్టీని తదుపరి తరానికి సజావుగా పాస్ చేసే ప్రక్రియలో భాగంగానే ఈ సంస్థాగత శస్త్రచికిత్సకు శ్రీకారం చుట్టారని ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు. ఆర్ఎస్ఎస్ ప్రచారక్ కోటా నుండి వచ్చి బీజేపీ జాతీయ సంఘటన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన బీఎల్ సంతోష్.. పార్టీలో అత్యంత కఠినమైన నిర్ణయాలు తీసుకునే వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారు. అయితే, గత కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో యడియూరప్ప లాంటి మాస్ లీడర్లను కాదని ఆయన అనుసరించిన కొన్ని క్షేత్రస్థాయి వ్యూహాలు పార్టీని ఘోరంగా దెబ్బతీశాయనే అసంతృప్తి అధిష్ఠానంలో బలంగా నాటుకుపోయింది. సౌత్ ఇండియాలో బీజేపీకి గేటెవే అయిన కర్ణాటకను చేజార్చుకోవడం, అలాగే కొన్ని ఉత్తరాది రాష్ట్రాల్లో టికెట్ల పంపిణీలో లోపాలు ఉండటం వల్లే పార్టీ ఆశించిన మెజారిటీని సొంతంగా సాధించలేకపోయిందని ఇంటెలిజెన్స్ నివేదికలు మోదీ-షాలకు చేరినట్లు తెలుస్తోంది. దీంతో ఆర్గనైజేషనల్ ఫ్రేమ్‌వర్క్‌లో సరికొత్త రక్తాన్ని ఎక్కించడం తప్పదని ఢిల్లీ పెద్దలు డిసైడ్ అయ్యారు. బీజేపీ లేదా సంఘ్ పరివార్ వ్యూహాల్లో జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి పదవి అత్యంత శక్తివంతమైనది. ఈ స్థానంలో ఉన్న వ్యక్తి నేరుగా ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయానికి, బీజేపీ అధినాయకత్వానికి మధ్య ఒక బలమైన వంతెనలా పనిచేస్తారు. పార్టీ జాతీయ అధ్యక్షుడి కంటే కూడా అంతర్గత నియామకాలు, క్రమశిక్షణ చర్యలు, రాష్ట్రాల ఇన్‌ఛార్జ్ నివేదికలపై ఈ పదవిలో ఉన్న వ్యక్తికే ఎక్కువ పట్టు ఉంటుంది. గతంలో కుశభావ్ ఠాక్రే, ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా, ఆ తర్వాత సంజయ్ జోషి, రామ్ లాల్ వంటి దిగ్గజాలు పనిచేసిన ఈ స్థానంలో మార్పు జరుగుతోందంటే.. పార్టీ సిద్ధాంత పరంగా, శైలి పరంగా చాలా పెద్ద మలుపు తిరగబోతోందని అర్థం. ఇటీవలి కాలంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ తదితర ప్రముఖులు చేసిన కొన్ని వ్యాఖ్యలు, బీజేపీ అంతర్గత అంశాలపై విమర్శలు చేశారు. క్షేత్రస్థాయిలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు , బీజేపీ నేతల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపించింది. బీఎల్ సంతోష్ హయాంలో సంఘ్‌కు, పార్టీకి మధ్య ఒక విధమైన కోల్డ్ వార్ నడిచిందని ప్రచారం కూడా ఉంది. ఇప్పుడు సంతోష్‌ను తిరిగి ఆర్ఎస్ఎస్ కు పంపి, ఇరు వర్గాలకు ఆమోదయోగ్యమైన సరికొత్త, సౌమ్యమైన వ్యూహకర్తను ఆ స్థానంలో పెట్టడం ద్వారా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను మళ్లీ ఎన్నికల పోరాటాల్లో యాక్టివ్ చేయాలని మోదీ భావిస్తున్నారు. మొత్తానికి మోదీ 3.0 ప్రభుత్వ హయాంలో అటు కేబినెట్, ఇటు పార్టీ ఐడెంటిటీని పూర్తిగా మార్చేసే లాంగ్ టర్మ్ ప్లాన్ అమలవుతోంది. కీలకమైన ప్రధాన కార్యదర్శుల మార్పుల ద్వారా సరికొత్త టీమ్ మోదీ రూపుదిద్దుకోనుంది. పాత సంకెళ్లను తెంచుకుని, కేవలం పనితీరు, గెలుపు గుర్రాలకే ప్రాధాన్యత ఇస్తూ బీజేపీ చేయబోతున్న ఈ మహా ప్రక్షాళన.. మిగిలిన రాజకీయ పార్టీలకు కూడా ఒక పెద్ద సంకేతాన్ని పంపుతోంది.

## క్రాంతి కుమార్ కుటుంబానికి అండగా ఉంటాం

- మొదటి పేజి తరువాయి

క్రాంతి కుమార్ ఆత్మహత్యే నిదర్శనమని అన్నారు. "ఆత్మహత్య చేసుకునే ముందు క్రాంతి కుమార్ స్వయంగా సెల్ఫీ వీడియో తీసి, సీఐ నాగరాజు, ఇతర పోలీసుల వేధింపుల గురించి వివరించారు. అయినా ఇంతవరకు బాధ్యులపై చర్యలు తీసుకోలేదు" అని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఎనిమిదేళ్ల క్రితం నమోదైన చిన్న కేసుల కోసం గత మూడు నెలలుగా రోజూ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వేధించడం వల్లే అతను ప్రాణాలు తీసుకున్నాడని ఆరోపించారు.ముఖ్యమంత్రి నివాసానికి, డీజీపీ, హోంమంత్రి కార్యాలయాలకు కూతవేటు దూరంలో ఈ ఘటన జరిగిందని జగన్ అన్నారు. "సీఐని కమిషనర్, కమిషనర్‌ను డీజీపీ, డీజీపీని ముఖ్యమంత్రి కాపాడుతున్నారు. ఇది ఒక ప్రొటెక్షన్ రాకెట్‌లా నడుస్తోంది" అని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు.

ఈ ఘటనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా నమోదు చేయకపోవడం దారుణమన్నారు. క్రాంతి కుమార్ కుటుంబానికి న్యాయపరమైన సహాయంతో సహా అన్ని విధాలా అండగా ఉంటామని జగన్ స్పష్టం చేశారు.

## రెండు, మూడు నెలల్లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం

- మొదటి పేజి తరువాయి

ఉందని ఆయన గురువారం వెల్లడించారు.

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ముడిచమురు ధరలు గరిష్ఠంగా ఉన్న సమయంలో కొనుగోలు చేసిన నిల్వలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రస్తుతం వినియోగిస్తున్నాయని మంత్రి వివరించారు. దీనివల్ల జూన్ 30 నాటికి ప్రభుత్వ రంగ చమురు సంస్థలు పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ విక్రయాలపై సుమారు రూ. 74,781 కోట్ల మేర నష్టాలను చవిచూశాయని పేర్కొన్నారు. ధరల తగ్గింపుపై ఇప్పుడే వ్యాఖ్యానించడం తొందరపాటే అవుతుందని, అదంతా ముడిచమురు ధరల స్థిరత్వంపైనే ఆధారపడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.ఇదిలావుండగా, ప్రైవేట్ రంగ ఇంధన రిటైలర్ 'నయారా ఎనర్జీ' జూలై 1 నుంచి తన అవుట్‌లెట్లలో లీటరు పెట్రోల్‌పై రూ. 5, డీజిల్‌పై రూ. 3 చొప్పున తగ్గించింది. గత రెండేళ్ల కాలంలో చమురు ధరలు తగ్గడం ఇదే తొలిసారి. అలాగే, వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ల ధరలను సైతం రూ. 183.50 మేర తగ్గించగా, గృహ వినియోగ సిలిండర్ల ధరల్లో మాత్రం ఎటువంటి మార్పు లేదు.

గత నాలుగేళ్లలో భారత్‌లో పెట్రోల్ ధరలు కేవలం 5.58 శాతం, డీజిల్ ధరలు 6.23 శాతం మేర మాత్రమే పెరిగాయని, అదే సమయంలో అభివృద్ధి చెందిన దేశాల్లో 20 శాతం, పొరుగు దేశాల్లో 35 శాతం వరకు పెరిగాయని మంత్రి గుర్తు చేశారు. అంతర్జాతీయంగా తీవ్ర ఒత్తిళ్లు ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకం తగ్గించి ప్రజలపై భారం పడకుండా చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రస్తుతం ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 102.12, డీజిల్ ధర రూ. 95.20 వద్ద స్థిరంగా కొనసాగుతోంది.

## అమరావతిపై జగన్ మరో డ్రామా.. రాష్ట్ర భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు

- మొదటి పేజి తరువాయి

మూడు రాజధానుల ప్రతిపాదన తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు 'మావిగన్' పేరుతో మరో కొత్త నినాదం తీసుకురావడం ప్రజలను అయోమయంలోకి నెట్టే ప్రయత్నమేనని ఆరోపించారు. అభివృద్ధికి, విధ్వంస రాజకీయాలకు మధ్యే అసలు పోటీ జరుగుతోందన్నారు.అమరావతిలో ఇప్పటికే వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని సోమిరెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలతో పాటు జాతీయ బ్యాంకులు, విద్యాసంస్థలు, ప్రైవేట్ కంపెనీలు అక్కడ ఏర్పాటవుతున్నాయని చెప్పారు. క్వాంటమ్ వ్యాలీ, ఏఐ యూనివర్సిటీ, ఎన్ఐడీ, ఎయిమ్స్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు అమరావతికి వస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో రాజధానిపై అనిశ్చితి సృష్టించడం రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమన్నారు.అమరావతి కోసం రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చి త్యాగాలు చేశారని సోమిరెడ్డి అన్నారు. ప్రస్తుతం రూ.57,821 కోట్ల విలువైన 97 అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అమరావతి కేవలం నగరం కాదని, ఐదు కోట్ల మంది ఆంధ్రుల ఆకాంక్ష అని చెప్పారు. ప్రజల ఆస్తులు, రైతుల భవిష్యత్తును దెబ్బతీసేలా ఎలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని జగన్‌ను హెచ్చరించారు.చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిపైనే దృష్టి పెట్టిందని సోమిరెడ్డి అన్నారు. సీఎం చంద్రబాబు అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, మంత్రి లోకేశ్ పెట్టుబడులు తీసుకురావడానికి ప్రపంచవ్యాప్తంగా పర్యటిస్తున్నారని చెప్పారు. గతంలో మూడు రాజధానుల ప్రతిపాదనను ప్రజలు తిరస్కరించారని, ఇప్పుడు కొత్త నినాదాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు ఫలించవని వ్యాఖ్యానించారు. రాష్ట్ర భవిష్యత్తుతో రాజకీయాలు చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు.

# నేను చదివిన ఆర్థికశాస్త్రం కంటే సమాజమే ఎక్కువ నేర్పింది

తాను ఆర్థిక శాస్త్రం చదివినప్పటికీ, పుస్తకాల కంటే సమాజం, ప్రజల నుంచే ఎక్కువ నేర్చుకున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆర్థిక వృద్ధి గణాంకాలు పెరగడం మాత్రమే కాకుండా, ఆ వృద్ధి పేదల జీవితాల్లో ఎంత మార్పు తీసుకొస్తోందన్నదే ప్రభుత్వానికి అసలైన కొలమానమని స్పష్టం చేశారు. డేటా ఆధారిత పాలన, సమర్థవంతమైన పరిపాలన ద్వారానే రాష్ట్రాన్ని బలమైన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దగలమని ఆయన పేర్కొన్నారు.

స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహిస్తున్న 'ఎకనమిక్ ఇంటెలిజెన్స్ ఫర్ గవర్నెన్స్ కెపాసిటీ బిల్డింగ్' రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో గురువారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

### పేదల జీవితాల్లో మార్పు కోసమే పాలన

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. జీఎస్‌డీపీ, సీఏజీఆర్ వంటి ఆర్థిక సూచికలను విశ్లేషిస్తూనే, వాటి ఫలాలు ప్రజల జీవన ప్రమాణాలను ఎలా మెరుగుపరుస్తున్నాయో చూడటమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇటీవలే గూడూరులో తాను పెన్షన్ పంపిణీ చేసిన తులశమ్మ, పద్మమ్మ కుటుంబాల స్థితిగతులను ఉదాహరణగా చూపుతూ, ప్రభుత్వ పథకాలు వారి జీవితాల్లో తెచ్చిన మార్పును సవివరంగా తెలియజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, డ్వాక్రా రుణాల ద్వారా ఆ కుటుంబాలు ఆర్థికంగా ఎలా నిలదొక్కుకుంటున్నాయో వివరించారు.

### దార్శనికతతో ముందుకు..

దేశంలోనే తొలిసారిగా విజన్-2020 రూపొందించినప్పుడు ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నామని, కానీ భవిష్యత్ అవసరాలను ముందుగానే అంచనా వేసి పనిచేశామని గుర్తు చేశారు. ఐటీ విప్లవం ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చి, సేవల రంగంలో అపార అవకాశాలు సృష్టిస్తుందని అప్పుడే విశ్వసించి, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకున్నామని ముఖ్యమంత్రి వివరించారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కూడా దేశానికి ఒక విజన్ డాక్యుమెంట్ అవసరమని బలంగా నమ్మారని చెప్పారు. ప్రస్తుత యుగంలో డేటానే అసలైన సంపద అని, భవిష్యత్ మొత్తం డేటా ఆధారిత నిర్ణయాలపైనే నడుస్తుందని ఆయన పేర్కొన్నారు.

### టెక్నాలజీతో పారదర్శక పాలన

ప్రభుత్వ సేవలు సమర్థవంతంగా అందించడంతో పాటు, రాష్ట్రంలో సంపద సృష్టించేందుకు ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడం కూడా అంతే కీలకమని చంద్రబాబు అన్నారు. అందుకే స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో ప్రైవేట్ పెట్టుబడులకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ప్రభుత్వ శాఖలన్నింటి సమాచారాన్ని ఒకే వేదికపైకి తెచ్చేందుకు 'డేటా లేక్' రూపొందిస్తున్నామని, ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరిచేందుకు హెల్త్ రికార్డులను పూర్తిగా డిజిటలైజ్ చేసే 'సంజీవని' ప్రాజెక్టును అమలు చేస్తున్నామని తెలిపారు. పేద, ధనిక వర్గాల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు, సమాజం ద్వారా ఎదిగిన వారు తిరిగి సమాజానికి సేవ చేసేలా ప్రోత్సహించేందుకు 'పీ4' (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్టనర్‌షిప్) కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు.

### అమరావతిలో క్వాంటం కంప్యూటర్

అనంతరం సభికులతో జరిగిన ముఖాముఖిలో సీఎం మాట్లాడుతూ.. తాను త్వరగా సంతృప్తి చెందే వ్యక్తిని కాదని, సంతృప్తి చెందితే అక్కడితో ఆగిపోతామని అన్నారు. ప్రజల కోసం నిరంతరం కొత్త విధానాలు, సాంకేతికతను అన్వేషిస్తూనే ఉండాలని సూచించారు. "దేశం నాకేమిచ్చిందని కాకుండా, దేశానికి మనమేం చేశామని ఆలోచించాలి" అని యువతకు పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఒక కీలక ప్రకటన చేస్తూ, త్వరలోనే అమరావతిలో క్వాంటం కంప్యూటర్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని, భవిష్యత్తులో క్వాంటం కంప్యూటర్లను తయారు చేసే సామర్థ్యాన్ని కూడా ఆంధ్రప్రదేశ్ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

### ఏపీ విధానాలపై నిపుణుల ప్రశంసలు

ఈ వర్క్‌షాప్‌లో భాగంగా జరిగిన ప్యానెల్ చర్చను ముఖ్యమంత్రి సభికుల మధ్య కూర్చొని ఆసక్తిగా తిలకించారు. ఈ చర్చలో పాల్గొన్న కేంద్ర స్టాటిస్టిక్స్, ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ శాఖ కార్యదర్శి డాక్టర్ సౌరభ్ గార్గ్, భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు డాక్టర్ వి. అనంత నాగేశ్వరన్, నీతి ఆయోగ్ సభ్యులు డాక్టర్ ఆర్. బాలసుబ్రహ్మణ్యం, ప్రధాని ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎస్. మహేంద్ర దేవ్ తదితరులు ఏపీ ప్రభుత్వ విధానాలను ప్రశంసించారు. నియోజకవర్గాల వారీ విజన్ ప్లాన్, పీ4 కార్యక్రమం, గ్రామస్థాయిలో డేటా సేకరణ వంటివి దేశంలోనే వినూత్నమైనవని, వీటిని జాతీయ స్థాయిలో అమలు చేయాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం... ఉత్తరాంధ్రకు వర్షసూచన

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకటించింది. ముఖ్యంగా ఉత్తరాంధ్రలోని ఒకటి రెండు ప్రాంతాల్లో భారీ వర్షాలు పడొచ్చని హెచ్చరించింది.వాయువ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న ఒడిశా-బెంగాల్ తీర ప్రాంతాల్లో ఈ అల్పపీడనం కేంద్రీకృతమై ఉంది. ఇది రానున్న రెండు, మూడు రోజుల్లో మరింత బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో రాష్ట్ర తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని పేర్కొన్నారు. (జూలై 3) శ్రీకాకుళం, పోలవరం, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో తీర ప్రాంత ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అల్పపీడన కదలికలను నిరంతరం గమనిస్తున్నామని, ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తామని తెలిపారు.

## ఏపీకి నేను మేనమామను... మేనమామ ఎప్పుడూ ఉత్త చేతులతో రాడు

ఆంధ్రప్రదేశ్‌కు తాను మేనమామ లాంటి వాడినని, మేనమామ ఎప్పుడూ ఖాళీ చేతులతో రాడని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. తనను మధ్యప్రదేశ్‌లో ప్రజలంతా ఆప్యాయంగా 'మామాజీ' అని పిలుస్తారని, ఇప్పుడు ఏపీ ప్రజలకు కూడా తాను మేనమామనే అయ్యానని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి వరాల జల్లు కురిపిస్తూ, ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన కింద 74,212 పక్కా ఇళ్లు, గ్రామీణ రోడ్ల నిర్మాణానికి రూ.422 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన పత్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు అందజేశారు.

తిరుపతి జిల్లా రైల్వేకోడూరులో కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకం 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అజీవికా మిషన్' (వీబీ జీ రామ్ జీ)ను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి శివరాజ్ సింగ్ చౌహాన్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ పథకం ఏపీ నుంచి ప్రారంభమై దేశవ్యాప్తంగా అమల్లోకి రావడం చారిత్రక ఘట్టమని ఆయన అభివర్ణించారు. దేశవ్యాప్తంగా గ్రామాల అభివృద్ధి కోసం ఈ పథకం కింద రూ.7.5 లక్షల కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. రాబోయే 9 నెలల కాలానికి గాను ఈ పథకం కింద ఏపీకి రూ.7,700 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామ సభలే తమకు అవసరమైన పనులను ఎంపిక చేసుకుని అమలు చేసే అధికారం ఈ పథకం కల్పిస్తుందని వివరించారు. ఈ సందర్భంగా రైతుల కోసం మరో కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలోని రైతుల నుంచి మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద 2,16,250 మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడిని కేంద్రం కొనుగోలు చేస్తుందని ప్రకటించారు. ఇందుకు సంబంధించిన పత్రాలను కూడా ఆయన ముఖ్యమంత్రికి అందజేశారు.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని, ఎట్టిపరిస్థితుల్లోనూ చేయి విడిచిపెట్టే ప్రసక్తే లేదని చౌహాన్ స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ

పుట్టినరోజున ఒక మొక్క నాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, కమలేశ్ పాశ్వాన్, రాష్ట్ర మంత్రులు సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వాళ్ల డ్రామా చూస్తుంటే బిగ్ బాస్ షో చూస్తున్నట్టుంది

తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. గురుకుల టెండర్లలో అవకతవకలు, రాష్ట్ర అప్పుల అంశంపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య చోటుచేసుకున్న సవాళ్లు, ప్రతిసవాళ్లు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. బహిరంగ చర్చకు సిద్ధమంటూ కాంగ్రెస్ విసిరిన సవాల్‌ను స్వీకరించి గన్ పార్క్ వైపు బయలుదేరిన బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకోవడంతో హైడ్రామా నెలకొంది.ఈ పరిణామాలపై కేంద్ర మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ కుమార్ ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య జరుగుతున్న వ్యవహారం 'బిగ్ బాస్' షోను తలపిస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. పైకి పోరాటంలా కనిపిస్తున్నా, లోపల ఆ రెండు పార్టీలు కుమ్మక్కయ్యాయని సోషల్ మీడియా వేదికగా విమర్శించారు. ఈ రెండు పార్టీల అవినీతి, రాష్ట్ర అప్పులు, పాలనా వైఫల్యాలపై బహిరంగ చర్చ ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుకు సూచించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో తెలంగాణకు కేంద్రం అందిస్తున్న సహకారాన్ని కూడా ప్రజలకు వివరిద్దామని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు 'డబుల్ ఎలిమినేషన్' తప్పదని, రాష్ట్రంలో 'డబుల్ ఇంజిన్' సర్కార్ రావడం ఖాయమని బండి సంజయ్ జోస్యం చెప్పారు.

## అమెరికాతో వాణిజ్య ఒప్పందం.. పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు

భారత్, అమెరికా మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చర్చలు తుది దశకు చేరుకున్నాయి. ఈ ఒప్పందానికి సంబంధించిన ప్రక్రియ దాదాపు 99 శాతం పూర్తయిందని, కేవలం ఒకే ఒక్క కీలక అంశంపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. ఈ ఒప్పందం ద్వారా అమెరికా మార్కెట్‌లో ప్రాంతీయ పోటీదారుల కంటే భారత్‌కు విశేష ప్రాధాన్యత లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు.గురువారం ఢిల్లీలో నిర్వహించిన 'ఇండో-జపాన్ స్ట్రాటజిక్ డైలాగ్' కార్యక్రమంలో పీయూష్ గోయల్ ప్రసంగించారు. ఈ ఒప్పందం ఇరు దేశాలకూ అత్యంత న్యాయబద్ధంగా, సమతుల్యంగా ఉంటుందని ఆయన అభివర్ణించారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో, భారత్‌కు సుంకాల పరంగా లబ్ధి చేకూర్చేందుకు అవసరమైన చట్టబద్ధమైన యంత్రాంగాన్ని రూపొందించడమే ప్రస్తుతం మిగిలి ఉన్న ఆ ఒక శాతం అడ్డంకి అని ఆయన వివరించారు. తయారీ రంగంలో ప్రధాన పోటీదారులైన చైనా, ఆగ్నేయాసియా దేశాల కంటే భారత్‌కు మెరుగైన ప్రాధాన్యత లభించాలని కోరుతున్నామని, దీనిపై అమెరికా సానుకూలంగా స్పందిస్తూ పరిష్కారం కోసం చురుగ్గా కృషి చేస్తోందని తెలిపారు. 2025 ప్రారంభంలో ఈ సమగ్ర ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు మొదలయ్యాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో మధ్యంతర ఒప్పందానికి సంబంధించిన ముసాయిదాను ఇరు దేశాలు ప్రకటించాయి. భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ సైతం ఈ ఒప్పందం తుది దశకు చేరుకుందని, కేవలం ఒక శాతం మాత్రమే పెండింగ్‌లో ఉందని ఇటీవల వ్యాఖ్యానించారు. జూలై 24న అమెరికా తాత్కాలిక టారిఫ్ చర్యల గడువు ముగియనున్న నేపథ్యంలో, ఆలోపే తొలి విడత ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## రాజకీయాల్లోకి స్టార్ హీరో సూర్య.. నిజమెంత?

తమిళనాడు రాజకీయాల్లో సినీ గ్లామర్ మరోసారి చర్చనీయాంశమైంది. నటుడు విజయ్ దళపతి పొలిటికల్ ఎంట్రీతో విజయవంతం కావడంతో ఇతర స్టార్ హీరోల రాజకీయ ప్రవేశంపై తరచూ ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో స్టార్ హీరో సూర్య త్వరలోనే రాజకీయాల్లోకి అడుగుపెట్టనున్నారంటూ వచ్చిన వార్తలు కోలీవుడ్ వర్గాల్లో కలకలం రేపాయి. సోషల్ మీడియాలో ఈ ప్రచారం జోరుగా సాగడంతో దీనిపై సూర్య టీమ్ అధికారికంగా స్పందించి పూర్తి స్పష్టత ఇచ్చింది.

### అభిమాన సంఘం నేత వ్యాఖ్యలతోనే..

సూర్య ఎన్నో ఏళ్లుగా 'అగరం ఫౌండేషన్' ద్వారా విద్యార్థులకు, పేదలకు అండగా నిలుస్తూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన అభిమాన సంఘాలు కూడా ఈ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటాయి. ఇటీవల చెన్నైలో జరిగిన 'సూర్య అఖిల భారత అభిమానుల పరిరక్షణ సంఘం' సమావేశంలో సంఘ ప్రతినిధి ఆర్. వీరమణి మాట్లాడుతూ భవిష్యత్తులో సూర్య రాజకీయాల్లోకి రావడం ఖాయమనే అర్థం వచ్చేలా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను ఆధారం చేసుకుని కొన్ని తమిళ మీడియా సంస్థలు కథనాలు ప్రచురించడంతో సూర్య రాజకీయ అరంగేట్రం వార్త వేగంగా వైరల్ అయింది. విజయ్ తరహాలోనే సూర్య కూడా ప్రజాసేవ నుంచి రాజకీయాల్లోకి వస్తున్నారని అభిమానులు అంచనా వేశారు.

### పుకార్లకు తెరదించిన సూర్య టీమ్

ఈ ప్రచారం ఊపందుకోవడంతో సూర్య టీమ్ వెంటనే రంగంలోకి దిగింది. సూర్యకు రాజకీయాల్లోకి రావాలనే ఆలోచన ప్రస్తుతానికి ఎంతమాత్రం లేదని స్పష్టం చేసింది. అభిమాన సంఘం సమావేశంలో వీరమణి చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగత అభిప్రాయం మాత్రమేనని, వాటితో సూర్యకు ఎలాంటి సంబంధం లేదని తెలిపింది. సూర్య నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల వెనుక ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదని, సమాజానికి మేలు చేయాలనే స్వచ్ఛమైన ఆశయంతోనే 'అగరం ఫౌండేషన్' ద్వారా విద్యార్థుల ఉన్నత చదువులకు సహాయం చేస్తున్నారని వివరించింది. కేవలం సామాజిక బాధ్యతతోనే ఆయన ఈ కార్యక్రమాలు చేపడుతున్నారని, వాటికి రాజకీయ రంగు పులమడం సరికాదని హితవు పలికింది. ఈ ప్రకటనతో సూర్య రాజకీయ ప్రవేశంపై జరుగుతున్న ప్రచారానికి ప్రస్తుతానికి తెరపడినట్లయింది.

## నాకు చాలా టఫ్ బాస్ ఉన్నారు

- మొదటి పేజి తరువాయి

గురువారం తిరుపతి జిల్లా శ్రీసిటీలో శ్రీసిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీని (ఎస్ఐయూ) ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో లోకేశ్ మాట్లాడుతూ, రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన ప్రభుత్వ దార్శనికతను, లక్ష్యాలను వివరించారు.

### 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఉన్నత శిఖరాలకు చేర్చడమే తమ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. "దేశ ఆర్థికాభివృద్ధిలో మన రాష్ట్రం ముందుండాలి. ప్రస్తుతం మన ఆర్థిక వ్యవస్థ 220 బిలియన్ డాలర్లుగా ఉంది. దీనిని 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలని కృతనిశ్చయంతో ఉన్నాం" అని ఆయన ప్రకటించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో వస్తున్న నూతన విద్యా విధానం, స్టార్టప్ ఇండియా, వికసిత్ భారత్ వంటి కార్యక్రమాలు దేశ విద్యా వ్యవస్థలో గొప్ప మార్పులు తీసుకొస్తున్నాయని కొనియాడారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా రాష్ట్రాలను ప్రోత్సహిస్తున్నారని, ఒక రాష్ట్రం మంచి పని చేస్తే మిగతా రాష్ట్రాలు పోటీపడతాయని ఆయన నమ్ముతారని లోకేశ్ తెలిపారు.

### ఏపీ యువతకు వరం శ్రీసిటీ యూనివర్సిటీ

శ్రీసిటీలో ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసిన వ్యవస్థాపకులు శ్రీని రాజు, రవీంద్ర సన్నారెడ్డిలను లోకేష్ అభినందించారు. ఇది కేవలం ఒక యూనివర్సిటీ ప్రారంభోత్సవం కాదని, ఉన్నత విద్యపై సరికొత్త ఆలోచనా విధానానికి పునాది అని అభివర్ణించారు.

"ఒక ఐడియాను వాస్తవరూపంలోకి తెచ్చిన శ్రీని రాజు గారికి నా అభినందనలు. ఇది ఆంధ్రప్రదేశ్ యువతకు ఒక పెద్ద గిఫ్ట్. ప్రస్తుతం 5,000 మంది విద్యార్థులతో ప్రారంభమవుతున్నా, భవిష్యత్తులో ఈ సంఖ్య కొన్ని రెట్లు పెరుగుతుందన్న నమ్మకం నాకుంది" అని ఆయన అన్నారు. కేవలం డిగ్రీలు ఇవ్వడమే కాకుండా, సమాజంలో ఎలాంటి మార్పు తీసుకొస్తున్నామనే దానిపైనే యూనివర్సిటీల విలువ ఆధారపడి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

### విద్యారంగంలో వినూత్న సంస్కరణలు

భారతదేశంలో ఉన్నత విద్యలో సంస్కరణలు రావాల్సిన అవసరం ఉందని లోకేశ్ నొక్కి చెప్పారు. శ్రీసిటీ యూనివర్సిటీలో ప్రవేశపెట్టిన 'వర్క్-స్టడీ' మోడల్‌ను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. దీనిని తాను 'లెగ్' మోడల్ అని పిలుస్తానని, అంటే నేర్చుకుంటూ, సంపాదిస్తూ, పట్టభద్రులు కావడమని వివరించారు.

"డిగ్రీ రాగానే చదువు ఆగిపోకూడదు. జీవితాంతం నేర్చుకోవడం అక్కడే మొదలవుతుంది. ఈ లెగ్ మోడల్ మన విద్యా వ్యవస్థ రూపురేఖలనే మార్చేస్తుంది" అని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. విద్యార్థులను కేవలం పట్టభద్రులుగా కాకుండా, సమస్యలను పరిష్కరించేవారిగా, నిరంతర అభ్యాసకులుగా తీర్చిదిద్దాలని సూచించారు.

# మాట తప్పడం, మడమ తిప్పడం జగన్‌కు అలవాటే

**- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు విమర్శలు**

**-పొగాకు రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుంది**

**- జూలై 4న ఏఎంసీ పాలకమండలి ప్రమాణ స్వీకారానికి భారీగా తరలిరావాలని పిలుపు**






**కందుకూరు, పెన్ పవర్ జూలై 2**

కందుకూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాజకీయ ప్రయోజనాల కోసం జగన్ ఎప్పటికప్పుడు తన వైఖరిని మార్చుకుంటూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. గతంలో అమరావతికి మద్దతు తెలిపిన జగన్, అనంతరం మూడు రాజధానుల ప్రతిపాదన తీసుకొచ్చారని, ఇప్పుడు "మావిగన్" పేరుతో కొత్త నినాదం వినిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. చివరకు అదే నినాదం వైసీపీ రాజకీయ పతనానికి కారణమవుతుందని వ్యాఖ్యానించారు. మాట తప్పడం, మడమ తిప్పడం జగన్ రాజకీయ జీవితంలో భాగమైందని, ఈసారి ప్రజలు ఆయనకు గట్టి బుద్ధి చెబుతారని అన్నారు.ఇటీవల తుంగభద్ర నదిలో మునిగి రెండు ఎద్దులు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసి బాధిత రైతులకు సహాయం అందించాలని సూచించారని తెలిపారు. అలాంటి ఘటనను కూడా జగన్ రాజకీయ విమర్శలకు వాడుకోవడం రైతులను తీవ్రంగా బాధించిందని అన్నారు. మీడియా సంస్థలను పేరుపేరునా ప్రస్తావిస్తూ జగన్ చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఎమ్మెల్యే విమర్శించారు. తల్లి, చెల్లి, పెద్దలు, రైతులు, మహిళల పట్ల కూడా గౌరవం లేని వ్యక్తి నీతులు చెప్పడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. పొగాకు రైతుల సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక సమావేశం నిర్వహించిన తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చిందని తెలిపారు. ప్రభుత్వం ప్రతిరోజూ మార్కెట్ పరిస్థితిని సమీక్షిస్తోందని, మరో రెండు మూడు రోజుల్లో రైతులకు గిట్టుబాటు ధర పూర్తిస్థాయిలో లభించే పరిస్థితి ఏర్పడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి కందుకూరు పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించనున్నట్లు ప్రకటించడంపై స్పందించిన ఎమ్మెల్యే, గత ప్రభుత్వంలో వ్యవసాయ మంత్రిగా ఉన్న సమయంలో ప్రకృతి విపత్తులతో నష్టపోయిన రైతులను పరామర్శించని ఆయనకు ఇప్పుడు రైతులపై ప్రేమ పుట్టడం ఆశ్చర్యంగా ఉందన్నారు. రైతుల ప్రయోజనం కోసం ఎవరైనా రావడాన్ని స్వాగతిస్తామని, అయితే రైతుల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేశారు. ఈ నెల 4వ తేదీ శనివారం కందుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కందుకూరు మండలం ఓగూరు గ్రామానికి చెందిన రాయపాటి సుభాషిణి చైర్‌పర్సన్‌గా, 14 మంది డైరెక్టర్లు, ఒక ఎక్స్అఫీషియో సభ్యుడు ప్రమాణ స్వీకారం చేయనున్నారని చెప్పారు. ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరుకానున్న నేపథ్యంలో నియోజకవర్గం నలు మూలల నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని మండల టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, మాదాల లక్ష్మీనరసింహం, సుబ్బారావు జనగర్ల నాగరాజు, పూరిమిట్ల గురునాథం, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, కాబోయే ఏఎంసీ చైర్మన్ రాయపాటి సుభాషిని, నాయకులు రాయపాటి శ్రీను, మల్లికార్జున వంకాయలపాటి మాల్యాద్రి చదలవాడ కొండయ్య షేక్ రఫీ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# పెన్ పవర్

## MARKAPURAM మార్కాపురం

## మార్కాపురం - ప్రకాశం

# ఇసుక లారీ అడ్డుకోవడంపై పరస్పర ఆరోపణలు

**పలుకుబడితో పోలీసులను వినియోగించుకున్నారంటూ ఒక వర్గం ఆగ్రహం...**




**పుల్లల చెరువు పెన్ పవర్ జూలై 2**

పుల్లల చెరువు మండల కేంద్రంలో అధికార పార్టీ టీడీపీలో వర్గపోరు మరోసారి వీధికెక్కింది. ఆధిపత్యం కోసం సాగుతున్న అంతర్గత పోరు తాజాగా ఇసుక లారీ వ్యవహారంతో బహిర్గతమైంది.ఒక వర్గానికి చెందిన ఇసుక లారీని ప్రత్యర్థి వర్గం తమ రాజకీయ పలుకుబడితో పోలీసుల ద్వారా అడ్డుకుందని తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటన స్థానిక రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.స్థానికుల కథనం ప్రకారం, మండల కేంద్రానికి వస్తున్న ఇసుక లారీని పుల్లల చెరువు ఎస్సై నిలిపివేయడంతో వివాదానికి తెరలేచింది.సాధారణ తనిఖీల్లో భాగంగా కాకుండా ప్రత్యర్థి వర్గం ఫిర్యాదు చేయడంతోనే లారీని ఆపించారని బాధిత వర్గం ఆరోపిస్తోంది. అధికార పార్టీ పేరును అడ్డం పెట్టుకుని వ్యక్తిగత కక్షలు తీర్చుకునేందుకు పోలీసు వ్యవస్థను వినియోగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.ఇసుక రవాణాకు అవసరమైన అనుమతులన్నీ ఉన్నప్పటికీ ఉద్దేశపూర్వకంగానే లారీని అడ్డుకున్నారని, తమను ప్రజల్లో అప్రతిష్ఠపాలు చేయాలనే కుట్ర జరుగుతోందని బాధిత వర్గం ఆరోపించింది. అధికార పార్టీ నాయకులే అధికారులను ప్రభావితం చేయడం దురదృష్టకరమని విమర్శించింది.మరోవైపు, అక్రమ ఇసుక రవాణాపై వచ్చిన సమాచారం మేరకే పోలీసులు తనిఖీ నిర్వహించారని, నిబంధనల ప్రకారమే లారీని నిలిపివేశారని ప్రత్యర్థి వర్గం చెబుతున్నట్లు సమాచారం.చట్ట ప్రకారం పోలీసులు విధులు నిర్వర్తించారని, దీనికి రాజకీయ రంగు పులమడం తగదని వారి వాదనగా తెలుస్తోంది.ఇప్పటికే మండలంలో రెండు వర్గాల మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరుకున్న నేపథ్యంలో ఈ ఘటన టీడీపీ అంతర్గత సంక్షోభాన్ని మరోసారి బయటపెట్టిందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.చిన్నచిన్న అంశాలకే పరస్పరం ఆరోపణలు, బహిరంగ విమర్శలు చేసుకోవడంతో పార్టీ కార్యకర్తలు తీవ్ర అయోమయంలో పడుతున్నారు.గత రెండు ఎన్నికల్లో మండల కేంద్రంలో టీడీపీ మద్దతు పొందిన అభ్యర్థులు వరుస విజయాలు సాధించినప్పటికీ, ప్రస్తుతం నెలకొన్న వర్గపోరు అదే పార్టీకి రాజకీయంగా నష్టాన్ని తెచ్చే ప్రమాదం ఉందని సీనియర్ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఈ పరిస్థితి కొనసాగితే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్షానికి అనుకూల పరిస్థితులు ఏర్పడే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.ఈ నేపథ్యంలో జిల్లా పార్టీ నాయకత్వం వెంటనే జోక్యం చేసుకుని ఇరు వర్గాల మధ్య సమన్వయం తీసుకురావాలని కార్యకర్తలు కోరుతున్నారు. లేదంటే వర్గపోరు మరింత ముదిరి పార్టీ ప్రతిష్ఠకు దెబ్బ తగిలే అవకాశముందని హెచ్చరిస్తున్నారు.అయితే, ఈ ఘటనపై పోలీసుల నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. అలాగే ఇరు వర్గాల ఆరోపణలపై పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

**రాష్ట్రపతి ఉత్తర్వులపై డీఈవోతో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధుల సమావేశం**





**మార్కాపురం రూరల్ పెన్ పవర్ జూలై 2**

రాష్ట్రపతి ఉత్తర్వులు, జిల్లాల పునర్విభజన నేపథ్యంలో ఉపాధ్యాయుల సేవా సమస్యలు, కేడర్ విభజన అంశాలపై మార్కాపురం జిల్లా గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాల జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో జిల్లా విద్యాశాఖాధికారి సామా సుబ్బారావు గురువారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ ఏపీ మార్కాపురం జిల్లా శాఖ తరఫున అధ్యక్షులు టి.కె.యస్. ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆర్. దేశా నాయక్ ఆధ్వర్యంలో పలు కీలక ప్రతిపాదనలు డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఎస్‌జీటీలు, స్కూల్ అసిస్టెంట్లను జిల్లా కేడర్‌గా, హెచ్ఎంలు, ఎంఈవోలు జోన్ కేడర్‌గా, డిప్యూటీ ఈఓలను మల్టీ జోన్ కేడర్‌గా పరిగణించాలని కోరారు. అదేవిధంగా భార్యాభర్తలకు ఒకే జిల్లాలో పోస్టింగ్ కల్పించడం, స్పౌజ్,డయాలసిస్, హీమోఫీలియా బాధితులకు ప్రాధాన్యత ఇవ్వడం, రివర్షన్ పొందిన ఉపాధ్యాయుల గత సేవను సీనియారిటీకి పరిగణనలోకి తీసుకోవడం, ఎయిడెడ్ ఉపాధ్యాయుల సేవలను గుర్తించడం, అంతర జిల్లా బదిలీల్లో సీనియారిటీ సమస్యలను పరిష్కరించడం,ఎస్ఏలుగా ఉండి పీఎస్ హెచ్ఎంలుగా పనిచేస్తున్న వారికి ఆప్షన్‌పై స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో ఏర్పడిన సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవడంతో పాటు, ఉద్యోగుల విభజనకు ముందు విద్యాశాఖలో పెండింగ్ పదోన్నతులు పూర్తి చేయాలని, పురపాలక, నగరపాలక ఉపాధ్యాయులకు సంబంధిత పాఠశాలలకు బదిలీ అవకాశం కల్పించాలని కోరారు.అలాగే జిల్లాల కేటాయింపులో కోరిన జిల్లా రాకపోయిన ఉపాధ్యాయులకు అంతర జిల్లా బదిలీల ద్వారా పాత జిల్లాకు తిరిగి వచ్చే అవకాశం కల్పించి సీనియారిటీ రక్షణ కల్పించాలని, రెండు నుంచి మూడు సంవత్సరాల్లో పదవీ విరమణ పొందనున్న ఉపాధ్యాయులను విభజన నుంచి మినహాయించాలని సూచించారు.ఉపాధ్యాయ సంఘాల ప్రతిపాదనలను జిల్లా విద్యాశాఖాధికారి సానుకూలంగా పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు.

# భక్తి శ్రద్ధలతో శ్రీ వారి ఆస్థానం

**- శ్రీగిరిలో శాస్త్రోక్తంగా శ్రవణా నక్షత్ర పూజలు**





**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూలై 02**

శ్రీవారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని గురువారం సాయంత్రం ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి ఆస్థానం కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీగిరి దేవస్థానం అర్చకులు వేద పండితులు శ్రీవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. నాద నీరాజనం.. చతుర్వేద పారాయణ.. విష్ణు సహస్ర నామ పారాయణతో పాటు భారత భాగవత భగవద్గీత రామాయణ శ్లోకాలను పద్యాలను గానం చేసారు. గాయని బొల్లాపల్లి ఫణిదీప్తి అన్నమయ్య సంకీర్తనలను మృదు మధురంగా ఆలపించి భక్తులను అలరించారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వేంకటేశ్వర రావు, ఆలూరు లక్ష్మీ కుమారి తదితరులు పర్యవేక్షించారు. శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందచేశారు. ప్రతి ఆదివారం ఉదయం 9,30 గంటలకు శ్రీగిరి దేవస్థానం గో క్షేత్ర భవన్ లో చిన్మయ మిషన్ తోడ్పాటుతో నిర్వహిస్తున్న శ్రీగిరి చిన్మయ బాలవిహార్ శిక్షణా తరగతులలో పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి కోరారు.

# పని చేయనప్పుడు మీకు ఉద్యోగం ఎందుకు..? జీతం ఎందుకు..?

**- వి.ఆర్.ఎస్. పెట్టి వెళ్లిపోండి ! - మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు.. సిబ్బంది పై జిల్లా కలెక్టర్ తీవ్ర ఆగ్రహం**





**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు జూలై 02**

పని చేయనప్పుడు మీకు ఉద్యోగం ఎందుకు..? జీతం ఎందుకు..? ప్రభుత్వ కార్యాలయం అంటే సత్రం అనుకుంటున్నారా..? పద్ధతి మార్చుకోండి..! లేదా ఉద్యోగానికి వి.ఆర్.ఎస్. పెట్టి వెళ్లిపోండి ! అంతే తప్ప నిర్లక్ష్యంగా ఉంటే ఊరుకునే ప్రసక్తే లేదు ' అని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. గురువారం ఆయన ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని అన్ని విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి ఉద్యోగి జాబ్ చార్ట్ పై ఆరా తీసి వారు చేస్తున్న పనిని ప్రత్యక్షంగా పరిశీలించారు. విధుల నిర్వహణలో కొందరు సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండటంపై కలెక్టర్ ఈ సందర్భంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి, పనితీరు మార్చుకోకపోతే ఇకనుంచి ఉద్యోగం చేయాల్సిన అవసరం ఉండదని హెచ్చరించారు. సుమారు గంటన్నర పాటు కార్పొరేషన్ లోని ప్రతి గదినీ తనిఖీ చేసి సంబంధిత ఫైళ్లను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని అధికారులకు ఆయన స్పష్టం చేశారు. టౌన్ ప్లానింగ్ విభాగంలోని సిబ్బందిని మార్చాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పని అవసరాలను గుర్తించి సిబ్బందిని రేషనలైజ్ చేయాలన్నారు. పారిశుద్ధ్యం కాకుండా ఇతర విభాగాలలో అవుట్ సోర్స్ ప్రాతిపదికన పనిచస్తున్న సిబ్బంది వివరాలను తనకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ లోని సిబ్బంది తమకు ఫోన్ చేసే ప్రజలతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని కలెక్టర్ చెప్పారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలకు పరిష్కారం పైనా తిరిగి వారితో మాట్లాడి ఆరా తీయాలని సిబ్బందిని ఆదేశించారు. మునిసిపల్ ఉద్యోగులు, సిబ్బంది అందరూ బయోమెట్రిక్ హాజరు వేయాలని, విధుల నిమిత్తం బయటకు వెళ్లేటప్పుడు మూమెంట్ రిజిస్టర్ లో కచ్చితంగా సంతకం చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనరుకు చెప్పారు. కార్పొరేషన్ ప్రాంగణంలోనూ, కార్యాలయంలో కూడా సిసి కెమెరాలు పూర్తిస్థాయిలో పెట్టాలని కలెక్టర్‌స్పష్టం చేశారు.

**అందరూ ఫీల్డ్ లో ఉండాలి...**

పారిశుద్ధ్య కార్మికులు అందరూ కచ్చితంగా వేకువజామునే ఫీల్డ్ లో విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. పారిశుద్ధ్యము, త్రాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ' ఆపరేషన్ క్లీన్ స్వీప్ ' మరో వారం రోజులు ఉన్నందున నగరం మొత్తం పారిశుద్ధ్య కార్యకలాపాలను ఉధృతం చేయాలన్నారు. నగర ప్రజలు తమ సమస్యలను మున్సిపాలిటీ దృష్టికి తీసుకువచ్చేందుకు ఏర్పాటు చేసిన 18004252381 టోల్ ఫ్రీ నంబర్ గురించి విస్తృత ప్రచారం కల్పించాలన్నారు.

**ప్రతివారం వస్తా... పురోగతి ఉండాలి**

నగర పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి గురువారం ఉదయం 11 గంటలకు మున్సిపాలిటీలో ప్రత్యేకంగా ' మీకోసం ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం కార్పొరేషన్ లోని స్పెషల్ ఆఫీసర్ చాంబర్ వద్దకు వచ్చిన ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. వాటి పరిష్కారానికి చర్యలు అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారం, ప్రజలకు సేవలు అందించడంలో ప్రతివారం నాణ్యత మరింత మెరుగుపడాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

**పోతురాజుకాలువ పై ప్రత్యేక దృష్టి**

గత ఏడాది మొంథా తుఫాను సమయంలో తలెత్తిన పరిస్థితి పునరావృతం కాకుండా పోతురాజు కాలువపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. పూడికతీతతో పాటు కాలువగట్లపై ఆక్రమణలు తొలగిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. మునిసిపల్ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. నగరంలోని ఖాళీ మునిసిపల్ స్థలాలను పి.పి.పి. పద్ధతిలో అభివృద్ధి చేస్తామన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ లు, హోటళ్ళు నిర్మించేందుకు ముందుకు వచ్చే వారికి కేటాయిస్తామన్నారు. నగరంలోని రోడ్ల వెంట ఫుట్ పాత్ కూడా అభివృద్ధి చేస్తామని కలెక్టర్ తెలిపారు. 150 ఏళ్ల చరిత్ర కలిగిన ఒంగోలు నగరాన్ని క్లీన్ సిటీగా మారుస్తామని చెప్పారు. జిల్లాకు లక్షల కోట్ల రూపాయలలో పెట్టుబడులు వస్తున్నందున ఆయా కంపెనీలకు సమీపంలో ఉన్న ఒంగోలు నగరాన్ని భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి చేయబోతున్నట్లు వివరించారు. ఈ విషయంలో ప్రజలు కూడా అధికార యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్


## పత్రికా ప్రకటన

## పాస్ పోర్ట్ లో పేరు మార్పు కొరకు

నా పేరు కామినేని సాయికుమార్, తండ్రి పేరు మోహన్ రావు, నివాసం: డోర్ నెం. 11-2-27, కోటకట్ట వీధి, కందుకూరు, ప్రకాశం జిల్లా - 523105.

నా పాస్‌పోర్టులో నా భార్య పేరు పొరపాటున JYOSNA KAMINENI గా నమోదైంది. అయితే, నా భార్య యొక్క సరైన పేరు KAMINENI JYOTHSNA.

కాబట్టి, నా పాస్‌పోర్టులో నమోదైన JYOSNA KAMINENI అనే పేరును "KAMINENI JYOTHSNA" గా సవరించినట్లు పరిగణించవలసిందిగా, సంబంధిత అధికారులు మరియు ప్రజలందరికీ ఈ ప్రకటన ద్వారా తెలియజేస్తున్నాను.

ఇట్లు,
కామినేని సాయికుమార్,
తండ్రి: మోహన్ రావు,
డోర్ నెం. 11-2-27, కోటకట్ట వీధి,
కందుకూరు,
ప్రకాశం జిల్లా - 523105.

# ఇంజనీరింగ్ విద్యార్థికి ఆర్థిక సాయం



**కందుకూరు పెన్ పవర్,జూలై 2**

కందుకూరు ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో సిఎస్సి ఏఐ చదువుతున్న పొన్నలూరు మండలం మూలేవారిపాలెం గ్రామానికి చెందిన జనిగర్ల శీను కుమార్తె ప్రవళిక కు కందుకూరుకు చెందిన చేబ్రోలు శీను కుమారుడు సురేంద్ర, మద్దాలి వెంకటేశ్వర్లు (బాబు) కుమారుడు రామకృష్ణ పేద విద్యార్థినికి హాస్టల్ ఫీజు ఆర్థిక సాయంగా ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ హరిబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పేద విద్యార్థిని విద్యకు ఆర్థిక సాయం అందించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. కష్టపడి చదువుకొని ప్రవళిక ఉన్నత స్థితికి వెళ్లాలని వారు ఆకాంక్షించారు.

# గిద్దలూరు ఎంపీ డిఓ గా జి వి మోహన్ కుమార్





**గిద్దలూరు పెన్ పవర్ జులై 2**

గిద్దలూరు మండల పరిషత్ అభివృధి అధికారి గా జి.వి. మోహన్ కుమార్ గురువారం విధులలో చేరారు ఇంతవరకు ఇక్కడ పని చేసిన ఎంపిడిఓ కె సీతారామ రావు పదవి విరమణ చేయగా మోహన్ కుమార్ ను ఇక్కడ ఎంపిడిఓ నియమించారు .దాంతో మోహన్ కుమార్ భాద్యతలు స్వీకరించారు. మండల పరిషత్ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికి పరిచయం చేసుకున్నారు అనంతరం ఎంపిడిఓ గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుమల అశోక్ రెడ్డి ని, మండల పరిషత్ అధ్యక్షులు కడప లక్ష్మీ వంశీధర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు.

# పొదిలిలో చురుగ్గా జరుగుతున్న సర్ కార్యక్రమం

**పొదిలి, పెన్ పవర్, జూలై 2**

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జరుగుతున్న సర్ కార్యక్రమం పొదిలిలో చురుగ్గా సాగుతోంది. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు కూడా పాల్గొంటూ, తమ సహాయ సహకారాలను అందిస్తున్నారు. అలాగే ఓటర్ వెరిఫికేషన్ కు సంబంధించిన వివరాలను అధికారులతో పాటు రాజకీయ నాయకులు కూడా ప్రజలకు వివరిస్తున్నారు. ఈ కార్యక్రమం ఈనెల 14వ తేదీతో ముగుస్తుంది. రాజకీయ నాయకుల సహకారం అందుతున్నందున పొదిలి ప్రాంతంలో సర్ కార్యక్రమం ఎంతో చురుగ్గా ముందుకు వెళ్తుంది.



# వి బి జి రాంజీ పథకం ఉపాధి పనులను ప్రారంభించిన బోనేని వెంకటేశ్వర్లు యాదవ్

**కొమరోలు పెన్ పవర్ జూలై 2**

కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన విబి జి రాంజీ పథకం ఉపాధి పనులను కొమరోలు మండలం తాటిచెర్ల పంచాయతీలో కొమరోలు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డాక్టర్ బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ గురువారం ప్రారంభించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును కేంద్ర ప్రభుత్వం విబీ జీరాంజీ ఉపాధి హామీ పథకం గా పేరు మార్పు చేసింది. అంతేకాక గతంలో ఉన్న వంద దినాల పని దినాలను 125 రోజులుగా పెంచుతూ మార్పు చేసింది.ఇక ప్రతి 14 రోజులకు ఒకసారి వేతనాలను ఉపాధి హామీ పథకం కూలీలకు ఇచ్చే విధంగా మార్పులు చేసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సూచనల మేరకు కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ గురువారం తాటిచర్ల పంచాయతీలో వీబి జిరాంజీ ఉపాధి హామీ పథకం పనులను లాంచనంగా ప్రారంభించారు ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారధ్యంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కూలీల సౌకర్యార్థం వందనాలు పని దినాలను 125 రోజులు పని దినాలుగా



మార్పు చేసిందని ఈ అవకాశం నిరుద్యోగ యువతీ యువకులకు కూలీలకు ఎంతో ప్రయోజనాన్ని కలిగిస్తున్నదని ఆయన తెలిపారు మన రాష్ట్రంలో బిజీ రాంజీ పథకం పనులను సమర్ధవంతంగా నిర్వహించి కేంద్ర ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర మంత్రులు ఎంతో కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అందువల్ల నిరుద్యోగ యువతీ యువకులు, కూలీలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల



ఆశయాలను నెరవేర్చాలని ఆయన కోరారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ జాబ్ కార్డు పొందాలని ఆయన సూచించారు.ఆ కార్యక్రమంలో వి బి జీరాంజీ ఉపాధి పథకం టెక్నికల్ అసిస్టెంట్ జి శ్రీనివాసులు, తాటిచెర్ల గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ సూరిబాబు, తాటిచెర్ల పంచాయతీలోని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఉపాధి పథకం కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# నరాల వ్యాధిగ్రస్తులకు జిజిహెచ్‌లో అందుబాటులో అద్భుతమైన చికిత్స

## – ఇంచార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏడుకొండలు



**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 02**

ప్రభుత్వ వైద్య కళాశాల అనుబంధ ప్రభుత్వ సర్వజన వైద్యశాల (జీజీహెచ్), ఒంగోలులోని న్యూరాలజీ విభాగం మరోసారి అరుదైన నరాల వ్యాధులతో బాధపడుతున్న ముగ్గురు రోగులకు విజయవంతంగా చికిత్స అందించింది. న్యూరాలజిస్ట్ డా. హరి ఆధ్వర్యంలోని వైద్య బృందం ఈ క్లిష్టమైన కేసులను సమర్థంగా నిర్వహించింది. సింగరాయకొండకు చెందిన షౌకత్ అలీ కార్టికోబేసల్ సిండ్రోమ్ (సిబిఎస్) అనే అరుదైన నరాల వ్యాధితో ఆసుపత్రిలో చేరారు. ఈ వ్యాధి వల్ల చేతులు, కాళ్లు సరిగా పనిచేయకపోవడం, శరీరం బిగుసుకుపోవడం, నడవడంలో ఇబ్బంది, రోజువారీ పనులు చేసుకోవడం కష్టంగా మారుతుంది. రోగికి అవసరమైన పరీక్షలు చేసి, మందులు, ఫిజియోథెరపీ, పునరావాస చికిత్స అందించి ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరిచారు. అలాగే మేదరమెట్లకు చెందిన 28 సంవత్సరాల కల్పన, ఒంగోలుకు చెందిన 50 సంవత్సరాల శైలజ ఎన్ఎంఓ లేదా డెవిక్స్ డిసీజ్ అనే తీవ్రమైన నరాల వ్యాధితో చికిత్స కోసం జీజీహెచ్‌కు వచ్చారు. శైలజకు ఈ వ్యాధి మూడోసారి తిరిగి వచ్చింది. ఈ వ్యాధిలో శరీర రోగనిరోధక శక్తి పొరపాటున వెన్నుపాము, కంటి నరాలపై దాడి చేస్తుంది. దీంతో చేతులు, కాళ్లు బలహీనపడటండి వెంటనే హై డోస్ స్టెరాయిడ్ చికిత్స ప్రారంభించింది. అనంతరం ప్లాస్మా ఎక్స్ఛేంజ్ ద్వారా రక్తంలో ఉన్న హానికర యాంటీబాడీలను తొలగించారు. అలాగే ఐవీఐజీ, రిటుక్సిమ్యాబ్, వంటి అత్యాధునిక మందులతో చికిత్స అందించారు. ప్రస్తుతం ఇద్దరు రోగులు కోలుకుంటున్నారు. ఈ తరహా చికిత్సలు ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రుల్లో చేయించుకుంటే రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చవుతుందని, అయితే జీజీహెచ్ ఒంగోలులో ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా ఈ వైద్య సేవలను అందిస్తోందని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డా. ఏడుకొండలరావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల్లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను బలోపేతం చేయడంతో జిల్లా ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా అందుతోందన్నారు. ఖరీదైన చికిత్సల కోసం ఇతర నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఒంగోలులోనే నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉందని తెలిపారు. డా. హరి ఆయన బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంఓ డా. మాధవీలత, ఏఆర్ఎంఓ డా. సునీల్ గవాస్కర్ పాల్గొన్నారు.

# టీడీపీకి గుడ్‌బై చెప్పి వైఎస్సార్‌సీపీలోకి 60 కుటుంబాలు

## డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేసిన కుందుర్రు గ్రామ ప్రజలు

**పెన్ పవర్, సంతమాగులూరు, జూలై 2**

సంతమాగులూరు మండలం కుందుర్రు గ్రామంలో తెలుగుదేశం పార్టీ విధానాలు నచ్చక ఆ పార్టీకి రాజీనామా చేసిన యాదవ, కమ్మ సామాజిక వర్గాలకు చెందిన 60 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ నాయకత్వంపై పూర్తి విశ్వాసం వ్యక్తం చేస్తూ వారు పార్టీలో చేరినట్లు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ నూతనంగా పార్టీలో చేరిన వారందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా వైఎస్సార్‌సీపీ కుటుంబంలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇచ్చారు.

**నాయకుల ఆధ్వర్యంలో చేరికలు**

మండల నాయకులు గడ్డం నర్సిరెడ్డి, దివికొల్లు సుబ్బారావు, పరిటాలవారిపాలెం కొండలు, కుందుర్రు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు మరియు ముస్లిం ప్రతినిధి షేక్ జిలాని ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. కుందుర్రు గ్రామంలో షేక్ జిలాని చేసిన కృషి వల్లే ఈ భారీ చేరికలు సాధ్యమయ్యాయని పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిప్రాయపడ్డారు. ఇదే స్ఫూర్తితో పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేసి అన్ని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీకి ఆదరణ పెంచేందుకు కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.



**పార్టీలో చేరిన వారు ..:** పార్టీలో చేరిన వారిలో చెవుల నాగేశ్వరరావు, మేకల గోవింద, అడవి ఆంజనేయులు, బొమ్మిడి పూజారి, తుమ్మలగుంట వీరబ్రహ్మాం, చింతలపూడి శ్రీనివాసరావు, చింతలపూడి పెద్ద శ్రీనివాసరావు, చింతలపూడి ఉమా, ముట్లూరి దిబ్బయ్య, బొడ్డు శీను, సన్నబోయిన శ్రీనివాసరావు (లడ్డు) తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియను పరిశీలించిన అధికారులు

**గిద్దలూరు, పెన్ పవర్ జులై 2**

ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు గిద్దలూరు నియోజకవర్గ మైల వెంకటేశ్వర రావు ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి – తహశీల్దార్, ఆంజనేయరెడ్డి , కమిషనర్ ఈవి , రమణ బాబు గిద్దలూరు నగర పంచాయతీ, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ సంయుక్తంగా క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలు, నివాస స్థితి, అర్హతలు , ప్రత్యేక సంక్షిప్త సవరణలో భాగంగా జరుగుతున్న నమోదు ప్రక్రియను పరిశీలించారు.



సంబంధిత బూత్ లెవెల్ అధికారులు నిర్వహిస్తున్న పనితీరును సమీక్షించి, ఓటరు జాబితాలో ప్రతి అర్హుడైన ఓటరు పేరు నమోదు అయ్యేలా, అనర్హుల పేర్లు తొలగించేలా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, ఫీల్డ్ వెరిఫికేషన్ సమయంలో ప్రజల నుంచి అందిన అభిప్రాయాలు, వినతులను స్వీకరించి, వాటిని ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రజలు, బీఎల్ఓలకు పూర్తి సహకరించాలని కోరారు,.

# అల్లూర రెడ్డికి ఘనంగా పదవీ విరమణ సన్మానం



**మార్కాపురం రూరల్ పెన్ పవర్ జూలై 2**

మార్కాపురం మండలం గొట్టిపడియ గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పొందుగుల అల్లూర రెడ్డి పదవీ విరమణ సందర్భంగా మార్కాపురం యూటీఎఫ్ కార్యాలయంలో గురువారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మండల యూటీఎఫ్ అధ్యక్షుడు డి. యలమందారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు ఓ.వి. వీరారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, అల్లూర రెడ్డి ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో విశిష్ట సేవలందించి విద్యార్థులు, సహచర ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా, మండల నాయకులు, ఉపాధ్యాయులు అల్లూర రెడ్డిని ఘనంగా సన్మానించి, పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

# ప్రతి కుటుంబానికి 125 రోజుల ఉపాధి కల్పనే లక్ష్యం

## కొరిశపాడు ఎంపీడీవో రాజ్యలక్ష్మి





**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) జూలై 02:**

గ్రామీణ ప్రాంతాల్లో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలని కోరిశపాడు ఎంపీడీవో రాజ్యలక్ష్మి అన్నారు. ఈ పథకం కింద అర్హులైన ప్రతి కుటుంబానికి 125 రోజుల పని కల్పనే లక్ష్యంగా సిబ్బంది పని చేయాలని ఆమె సూచించారు. ఇందులో భాగంగా గురువారం మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పనులను వి.బి.జి. రామ్‌జీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఉపాధి పనుల కల్పనపై క్షేత్రస్థాయి సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎంపీడీవో పలు కీలక సూచనలు జారీ చేశారు. పనుల్లేక గ్రామాల్లోని కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పని అడిగిన ప్రతి ఒక్కరికీ వెంటనే పనులు చూపించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. గ్రామాల్లో కొత్త ఉపాధి పనుల గుర్తింపులో చొరవ చూపాలని, అలాగే పని చేసిన కూలీలకు సకాలంలో వేతనాలు అందేలా చూడటంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని ఫీల్డ్ అసిస్టెంట్లు, క్షేత్రస్థాయి సిబ్బందిని అధికారులు హెచ్చరించారు. ఉపాధి హామీ పనుల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

# అర్హత కలిగిన ఏ ఒక్కరూ ఓటు హక్కును కోల్పోకూడదు

## - బిఎల్ఏ లకు టిడిపి రాష్ట్ర మైనారిటీ నాయకులు సూచన





**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 02**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను వేగవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనారిటీ సెల్ నాయకులు షేక్ కఫిల్ బాషా, పఠాన్ హనీఫ్ ఖాన్ బిఎల్ఏ లకు సూచించారు. ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు ఆదేశాల మేరకు గురువారం నగరంలోని కోట వీధి, ఇస్లాం పేట సచివాలయాలల్లో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ ను వారు పరిశీలించారు. అర్హత కలిగిన ప్రతి ఓటును క్షుణ్ణంగా పరిశీలించి బిఎల్ఓ లకు అవసరమైన ఆధారాలను అందించే క్రమంలో ఓటర్లకు బిఎల్ఓ లకు సహకరించాలన్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు ఆదేశాలను బిఎల్ఏ లకు వివరించారు. ముఖ్యంగా షిఫ్టింగ్ ఓట్లపై దృష్టి సారించి వారు ఎక్కడ ఉన్నారు తెలుసుకొని వారు ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని, వారికి అవసరమైన ఆధార పత్రాలను ఆన్ లైన్ లో చూసి అందించాలని సూచించారు. బూత్ వైజ్ గా ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు ఓటర్లకు అందించారు.. దరఖాస్తులు పూర్తి చేసి తిరిగి బిఎల్ఓ లకు ఎంత మంది ఓటర్లు అందజేశారు వంటి వివరాలను బిఎల్ఏ ల వద్ద అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మైనారిటీ నాయకులు షేక్ అమ్రుల్లా, షేక్ సిలార్, షేక్ అల్లా బక్షు, షేక్ అక్బర్, షేక్ అష్రఫ్, షేక్ మస్తాన్ (బాబా), షేక్ అబ్దుల్లా, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం మైనారిటీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

### తెలుగుదేశం మైనారిటీ నేత రసూల్ మహమ్మద్ స్పష్టం



**పొదిలి, పెన్ పవర్, జూలై 2**

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలుగుదేశం పార్టీ ఒంగోలు పార్లమెంట్ మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్ చెప్పారు. అందులో భాగంగానే విజయవాడ నుండి హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక సబ్సిడీ అందించడం జరిగిందన్నారు. హజ్ యాత్రకు వెళ్లే 331 మంది ముస్లింలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున నగదు బదిలీ చేయడం జరిగిందన్నారు. ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు, రాష్ట్ర ప్రభుత్వానికి రసూల్ మహమ్మద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# వీబీజీ-రామ్‌జీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

### ఎంపీడీవో మరియదాస్



**పుల్లల చెరువు పెన్ పవర్ జూలై 2**

వీ బీ జీ--రామ్‌జీ (ఉపాధి హామీ) పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పుల్లలచెరువు ఎంపీడీఓ మరియదాసు కోరారు. గురువారం మండలంలోని సుద్దకురవ తండాలో వీబీజీ--రామ్‌జీ పథకం కింద చేపట్టిన ఇంకుడు గుంతల తవ్వకం పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మరియదాసు మాట్లాడుతూ గతంలో 100 రోజులుగా ఉన్న ఉపాధి హామీ పనిదినాలను ప్రస్తుతం 125 రోజులకు పెంచినట్లు తెలిపారు. అలాగే కూలీల దినసరి వేతనాన్ని రూ.307 నుంచి రూ.312కు పెంచినట్లు తెలిపారు. ఈ పథకం కింద 4 ప్రధాన కేటగిరీలలో మొత్తం 318 రకాల అభివృద్ధి పనులను చేపట్టే అవకాశం ఉందని వివరించారు. జల సంరక్షణ, గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, జీవనోపాధి అభివృద్ధి, విపత్తుల నిర్వహణ వంటి విభాగాల్లో వివిధ పనులు చేపట్టి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కూలీ ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉపాధితో పాటు గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ మాజీ మండల కన్వీనర్ పయ్యావుల ప్రసాద్, సీనియర్ నాయకులు రెంటపల్లి సుబ్బారెడ్డి, ఏపీవో మోషే, ఉపాధి హామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వీబీజీ - రామ్ పనులను సద్వినియోగం చేసుకోవాలి

### ఎంపీడీవో వి ప్రతాపరెడ్డి

**ముండ్లపాడు, పెన్ పవర్ జులై 2**

కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం స్థానంలో వీబీజీ రామ్ నూతన చట్టాన్ని ప్రవేశపెట్టిందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వి ప్రతాపరెడ్డి అన్నారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను మరింత విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వీబీజీ-రామ్ నూతన చట్టాన్ని మండలంలోని ముండ్లపాడు గ్రామంలో గురువారం ఎంపీడీవో వి. ప్రతాపరెడ్డి ప్రారంభించారు ముఖ్య అతిథిగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొబ్బూరి రమేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీడీవో వి. ప్రతాపరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ పేద కుటుంబాలకు స్థిరమైన ఉపాధి కల్పించడం, వారి జీవనోపాధిని మెరుగుపరచడం, గ్రామాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ నూతన చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. గతంలో అమలులో ఉన్న ఉపాధి హామీ పథకం కింద 100 రోజుల ఉపాధి కల్పించగా, ఇప్పుడు వీబీజీ-రామ్ చట్టం ద్వారా 125 రోజులకు పెంచడం జరిగిందని తెలిపారు. గ్రామీణ కుటుంబాలకు అదనంగా 25 రోజుల ఉపాధి లభించి వారి ఆర్థిక పరిస్థితి మరింత మెరుగుపడుతుందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని వినియోగించుకొని ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను పొందాలని సూచించారు. ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొబ్బూరి రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం



చేసుకుంటూ గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అమలు చేస్తున్నాయని అన్నారు కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ ప్రజల సంక్షేమం పథకాల ఫలాలు నేరుగా ప్రతి లబ్ధిదారునికే చేరేలా చర్యలు తీసుకుంటున్నారని, ప్రభుత్వ అమలు చేస్తున్న విబిజి రామ్ పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఏపీవో సుబ్బారావు, పట్టణ టిడిపి అధ్యక్షులు బత్తుల వెంకటాద్రి, టిడిపి నాయకులు గజ్జల కోటిరెడ్డి, ఈసీ వెంకట్రావు, విబిజి రామ్ కూలీలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# మాజీ సర్పంచ్ అబ్దుల్ సాహెబ్ మృతి పట్ల మంత్రి గొట్టిపాటి సంతాపం

### కుటుంబ సభ్యులకు పరామర్శ.. ప్రగాఢ సానుభూతి



**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) జూలై 02:**

బల్లికురవ మండలం, కొప్పెరపాడు గ్రామ మాజీ సర్పంచ్, సీనియర్ నాయకులు షేక్ అబ్దుల్ సాహెబ్ (86) అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన మరణవార్త తెలుసుకున్న రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి. రవికుమార్ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. గురువారం కొప్పెర పాడులోని అబ్దుల్ సాహెబ్ నివాసానికి చేరుకున్న మంత్రి గొట్టిపాటి.. ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం అబ్దుల్ సాహెబ్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. దశాబ్దాల పాటు గ్రామానికి, పార్టీకి అబ్దుల్ సాహెబ్ అందించిన సేవలను ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి. రవికుమార్ గుర్తుచేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జన విజ్ఞాన వేదిక సభ్యత్వం స్వీకరించిన డాక్టర్ మల్లికార్జున రెడ్డి



**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 2**

శాస్త్రీయ దృక్పథం పెంపొందించడమే జన విజ్ఞాన వేదిక ప్రధాన లక్ష్యమని సి.ఎస్.పురం మండల జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు డాక్టర్ షేక్ గౌస్ అన్నారు. సి ఎస్ పురం మండల జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు డాక్టర్ షేక్ గౌస్ , మండల ప్రధాన కార్యదర్శి జె వెంకట్రావు ఆధ్వర్యంలో గురువారం ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు, మల్లికార్జున రెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ పి. మల్లికార్జున రెడ్డి జన విజ్ఞాన వేదిక సభ్యత్వాన్ని స్వీకరించి, సంస్థ గోడ పత్రిక ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా డాక్టర్ షేక్ గౌస్ మాట్లాడుతూ సమాజంలో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించడం, మూఢనమ్మకాల నిర్మూలన, ప్రజల్లో విజ్ఞానాన్ని విస్తరించడం కోసం జన విజ్ఞాన వేదిక ఎన్నో సంవత్సరాలుగా నిరంతరం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు, యువత, ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు అవగాహన కార్యక్రమాలు, సదస్సులు, గోడ పత్రికలు, విజ్ఞాన ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజ సేవ పట్ల ఆసక్తి కలిగిన ప్రముఖులు సంస్థ సభ్యత్వం స్వీకరించడం జన విజ్ఞాన వేదికకు మరింత బలాన్ని చేకూరుస్తుందని పేర్కొంటూ డాక్టర్ పి. మల్లికార్జున రెడ్డిని అభినందించారు.డాక్టర్ పి. మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ సమాజంలో శాస్త్రీయ చైతన్యం పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ప్రజల్లో ఆరోగ్య అవగాహనతో పాటు శాస్త్రీయ దృక్పథం పెరగాల్సిన అవసరం ఉందని, ఇలాంటి కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమానికి ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత

### పొదిలి ఏ ఎం సి చైర్మన్ డాక్టర్ ఇమాంస



**పొదిలి, పెన్ పవర్, జులై 2**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని పొదిలి మార్కెట్ కమిటీ చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంస చెప్పారు. గురువారం నాడు మండలంలోని గోగినేని వారి పాలెం గ్రామంలో వికసిత్ భారత్-జి రామ్ జి కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి మండల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏఎంసి చైర్మన్ డాక్టర్ ఇమాంస మాట్లాడుతూ రాష్ట్రంలోనే కూటమి ప్రభుత్వం రైతు, రైతు కూలీల సంక్షేమం కోసం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గునుపూడి భాస్కర్, మాజీ ఉపసర్పంచ్ షేక్ జిలాని భాష, మండల తెలుగుదేశం పార్టీ ఎస్సీ నాయకులు జ్యోతి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శక ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో చార్టెడ్ అకౌంటెంట్ల పాత్ర కీలకం

### -నేతి మహేశ్వరరావు -చార్టెడ్ అకౌంటెంట్ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు



**కందుకూరు, పెన్ పవర్ జూలై 2**

చార్టెడ్ అకౌంటెంట్ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని చార్టెడ్ అకౌంటెంట్లకు ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్ ఫోరం ప్రతినిధి, చార్టెడ్ అకౌంటెంట్ నేతి మహేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విడుదల చేసిన ప్రకటనలో చార్టెడ్ అకౌంటెంట్లు దేశ ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమైన బాధ్యతను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఒక ఆడిటర్‌పై సమాజం ఉంచే నమ్మకం దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తుందని, పారదర్శకత, బాధ్యతాయుతత, ఆర్థిక క్రమశిక్షణను నెలకొల్పడంలో చార్టెడ్ అకౌంటెంట్ల సేవలు ఎంతో విలువైనవని ఆయన అన్నారు. బీఎస్సీ పూర్తి చేసిన అనంతరం చార్టెడ్ అకౌంటెన్సీ వృత్తిలోకి అడుగుపెట్టడం తన జీవితంలో ఒక కీలక మలుపుగా నిలిచిందని తెలిపారు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్ ఫోరం ద్వారా వ్యవస్థలో ఉన్న అవినీతిని అరికట్టేందుకు అవసరమైన విధాన మార్పుల కోసం కృషి చేయడం తనలో మరింత సామాజిక బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు.ప్రభుత్వ అకౌంటింగ్ విధానంలో సమూల మార్పులు తీసుకొస్తేనే దేశ సంపదను సమర్థవంతంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. దీంతో ప్రభుత్వ వ్యవహారాల్లో పారదర్శకత పెరిగి, అవినీతికి తావులేని పరిపాలన సాధ్యమవుతుందని చెప్పారు. చార్టెడ్ అకౌంటెంట్‌గా తన వృత్తిని గౌరవప్రదంగా నిర్వహిస్తూ, సామాజిక బాధ్యతను గుర్తించి అవినీతి రహిత రాజకీయ వ్యవస్థ నిర్మాణంలో తన వంతు పాత్రను నిరంతరం పోషిస్తానని నేతి మహేశ్వరరావు స్పష్టం చేశారు.

# విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ

**కందుకూరు పెన్ పవర్, జూలై 2**

పట్టణంలోని కొత్తపాలెం ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలోని విద్యార్థులకు విద్యా సామాగ్రిని ప్రముఖ వ్యాపారవేత్త, సూర్యా రెస్టారెంట్ అధినేత పిడికిటి వెంకటేశ్వర్లు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన సుమారు 12,000 రూపాయలు నోట్ బుక్స్ , పెన్నులు , పెన్సిల్స్ , పలకలు, బలపాలు, ఎరేజర్స్, డ్రాయింగ్, టేబుల్ బుక్స్, స్కేల్స్ , క్రేయాన్స్ , కాపీ రైటింగ్ బుక్స్ మొదలగు స్టేషనరీని అందజేశారు. ఈ సందర్భంగా దాత వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పిల్లలు బాగా చదువుకుని, పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.





అంతేకాకుండా సదరు పాఠశాల ప్రహరీగోడ నిర్మాణానికి ముందుకు వచ్చి తన వంతు సహాయం గా 20,000 విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి ఎం నాగకుమార శర్మ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు అన్నిరంగాలలో రాణించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు చేయూత ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి సరోజమ్మ , ఉపాధ్యాయులు నిర్మల, అసిఫా బేగం, దామా కొండపనాయుడు, మంగమ్మ, సీఆర్ఎంటీ రమణారెడ్డి, పాఠశాల కమిటీ సభ్యులు, పిల్లల తల్లిదండ్రులు కార్యక్రమంలో పాల్గొని దాత పిడికిటి వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు.

# బహుమతుల పంపిణీ

**పుల్లల చెరువు పెన్ పవర్ జులై 2**

మొహరం పండుగ వేడుకల్లో వేషధారణలు గావించి ప్రజలను మెప్పించిన పలువురికి గురువారం నాడు బహుమతుల పంపిణీ కార్యక్రమం జరిగింది. మొహరం పండుగను పురస్కరించుకొని పీర్లను నిలబెట్టిన రోజున పుల్లలచెరువుకు చెందిన పలువురు యువకులు వేషధారణలతో ప్రజలను విశేషంగా ఆకట్టుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారికి పుల్లలచెరువు కు చెందిన పెద్దలు గురువారం నాడు బహుమతులను పంపిణీ చేయడం జరిగింది. అలాగే ప్రతి సంవత్సరం యువకులు మొహర్రం వేడుకల్లో విశేష సంఖ్యలో పాల్గొని, చిత్ర విచిత్ర వేషధారణలతో ప్రజలను అలరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొర్లకుంట జానకి రఘు, గోపవరపు గురునాథం, కొత్త చిన్న, షేక్ బాజీ, దూదేకుల కాశింవలి తదితరులు పాల్గొన్నారు.



# సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

## -లింగసముద్రం మండలంలో 25 మందికి రూ.13.75 లక్షల చెక్కుల పంపిణీ

## - ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు -ఇప్పటివరకు 1,488 మందికి రూ.11.54 కోట్ల సహాయం అందించాం





**కందుకూరు పెన్ పవర్,జూలై 2:**

ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. గురువారం కందుకూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లింగసముద్రం మండలానికి చెందిన 25 మంది లబ్ధిదారులకు రూ.13.75 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీని 39వసారి నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 1,488 మంది లబ్ధిదారులకు రూ.11.54 కోట్ల ఆర్థిక సహాయం అందించినట్లు వెల్లడించారు.

గత ప్రభుత్వంలో పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి సక్రమంగా అందలేదని ఆరోపించిన ఆయన, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆర్థిక సహాయం అందజేస్తోందన్నారు. ప్రజా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తూనే రాష్ట్ర అభివృద్ధికి కూడా ప్రభుత్వం సమానంగా కృషి చేస్తోందని పేర్కొన్నారు.

రాష్ట్ర విభజన అనంతరం ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకుని పరిశ్రమలను ఆకర్షించడం ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళుతున్నామని ఎమ్మెల్యే అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధి, ముందుచూపుతో ఆంధ్రప్రదేశ్ పురోగతి పథంలో ముందుకు సాగుతోందని చెప్పారు.

సీఎంఆర్ఎఫ్ సహాయం పొందిన లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ వారి ఆశీస్సులు అందించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మండల అధ్యక్షులు పూరిమిట్ల గురునాథం, రాచగర్ల సుబ్బారావు, జనిగర్ల నాగరాజు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, మాదాల లక్ష్మీనరసింహం, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, ఏఎంసీ చైర్‌పర్సన్‌గా నియమితులైన రాయపాటి సుభాషిణి, ఉన్నం వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు..



**పుల్లల చెరువు పెన్ పవర్ జూలై 2**

భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 125 రోజుల "వికసిత భారత్--జీ రామ్‌జీ" కార్యక్రమాన్ని పుల్లలచెరువు మండలంలోని ఐ.టి.వరం గ్రామ పంచాయతీలో గురువారం ఘనంగా ప్రారంభించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సంయుక్తంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో భాగంగా ఐ.టి.వరం గ్రామంలో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అలాగే పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పుల్లలచెరువు మండల టీడీపీ కన్వీనర్ పోట్ల గోవిందు మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని, ప్రజల సమస్యలను తెలుసుకుని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పావులూరి మన్నేయ్య, గద్దె మల్లయ్య, ఎఫ్ ఏ సూరాబత్తిని రాముడు, సోమెపల్లి కోటయ్య, సోమేపల్లి సుబ్బారావు, శీలం కోటేష్, టీఏ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన పదవులకు ఆశావాహుల నుంచి భారీగా దరఖాస్తులు

**-నెల్లూరు పార్లమెంట్ పరిధిలో ఇప్పటికే 230 దరఖాస్తులు స్వీకరణ**



**కందుకూరు పెన్ పవర్ జూలై 2**

నెల్లూరు పార్లమెంట్ నిర్మాణ సారథుల పర్యవేక్షణలో పార్లమెంట్ పరిధిలోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన పార్టీ పదవుల కోసం ఆశావాహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై తమకు అవకాశం కల్పించాలని కోరుతూ అప్లికేషన్లను కమిటీకి అందజేస్తున్నారు. పార్టీ ఆదేశాల మేరకు అప్లికేషన్ కమిటీ ప్రతి కార్యకర్త నుంచి వారి వివరాలను స్వీకరించి నమోదు చేస్తోంది. అర్హత, పార్టీ అవసరాలు, అందుబాటులో ఉన్న అవకాశాల మేరకు పదవుల కేటాయింపు ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, విధానాలు, ప్రజా సమస్యలపై పార్టీ చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కమిటీ సూచించింది. నెల్లూరు పార్లమెంట్ పరిధిలో ఇప్పటివరకు సుమారు 230 దరఖాస్తులు అందినట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు.

# బీసీవై పార్టీ జిల్లా మైనార్టీ సెల్ కన్వీనర్ షేక్ నజీర్ భాష



**సి ఎస్ పురం, పెన్ పవర్ జులై 2**

బీసీవై పార్టీ రాష్ట్ర కమిటీ చేపట్టిన సంస్థాగత నియామకాలలో భాగంగా ప్రకాశం జిల్లా మైనార్టీ సెల్ కన్వీనర్ గా షేక్ నజీర్ భాషను రాష్ట్ర అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ నియమించారు. ఈ మేరకు సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన పేరును రాష్ట్ర నాయకత్వానికి సిఫారసు చేసిన స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మైనార్టీలకు బీసీవై పార్టీలో సముచిత ప్రాధాన్యం కల్పిస్తూ నాయకత్వ అవకాశాలు అందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుల నిర్ణయం అభినందనీయమని పేర్కొన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రకాశం జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు మైనార్టీ వర్గాలను బీసీవై పార్టీ వైపు ఆకర్షించి పార్టీ అభివృద్ధికి తన వంతు పాత్రను సమర్థంగా కృషి చేస్తానని తెలిపారు.

# వినియోగదారుల్లో సంతృప్తి స్థాయి పెంపే లక్ష్యంగా పనిచేయాలి

## - విద్యుత్ శాఖ అధికారులకు జిల్లా కలెక్టర్ సూచన






క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 02

విద్యుత్ సరఫరా, సేవలపై వినియోగదారుల్లో సంతృప్తి స్థాయి పెంపే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ పి.రాజా బాబు స్పష్టం చేశారు. సూర్య ఘర్ పథకం అమలుపై గురువారం ప్రకాశం భవనంలో ఆయన అధ్యక్షతన జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు రూఫ్ టాప్ సోలార్ విద్యుత్ ప్యానళ్లు అమర్చటంలో పురోగతిపై ఏజెన్సీల వారీగా కలెక్టర్ సమీక్షించారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు సోలార్ సెట్స్ అమర్చేలా పనిచేయాలని ఏజెన్సీలను ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో గుర్తించిన నాలుగు మోడల్ సోలార్ గ్రామాలలో 100 శాతం రూఫ్ టాప్ సోలార్ ప్యానళ్ళను బిగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యుత్ శాఖ సిబ్బంది ఎల్లవేళలా వినియోగదారులకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ చెప్పారు. మీకోసం అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉండకూడదు అన్నారు. విద్యుత్ సేవల పట్ల ప్రజల్లో సంతృప్తి శాతం మెరుగ్గా ఉండేలా సిబ్బంది, అధికారులు పనిచేయాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవాలని సచించారు. ఈ సమావేశంలో ఏపీసిపిడిసిఎల్ ఎస్.ఈ. వెంకటేశ్వర్లు, ఒంగోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాకినేని హరిబాబు, ఇతర డివిజన్ల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, జెడ్పి సీఈవో చిరంజీవి, ఎల్.డి.ఎం.రమేష్, డిఆర్డిఏ, నెడ్ క్యాప్ అధికారులు, సోలార్ వెండర్లు పాల్గొన్నారు.

# విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్ల చోరీలకు అడ్డుకట్ట వేయాలి - సీఐ పి. శేషగిరిరావు

## ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాలు - డీఎస్పీ మురళీకృష్ణ సూచనల మేరకు ప్రత్యేక సమీక్ష



**పెన్ పవర్,**
**సంతమాగులూరు, జూలై 2**

ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు, దర్శి డీఎస్పీ టి. మురళీకృష్ణ సూచనలతో సంతమాగులూరు సర్కిల్ పరిధిలో పెరుగుతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, వ్యవసాయ మోటార్లు, రాగి తీగలు, సోలార్ పంపుసెట్ల పరికరాల చోరీలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో సంతమాగులూరు సీఐ పి. శేషగిరిరావు ఆధ్వర్యంలో గురువారం సర్కిల్ కార్యాలయంలో సంతమాగులూరు, బల్లికురవ మండలాలకు చెందిన విద్యుత్ శాఖ ఏఈలు, లైన్‌మెన్లు, హెల్పర్లు, రైతు ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

**చోరీల నివారణకు సమన్వయ కార్యాచరణ**

ఇటీవల చుట్టుపక్కల మండలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులోని రాగి కాయిల్స్‌ను దొంగిలించడం, వ్యవసాయ మోటార్లను ధ్వంసం చేసి రాగి తీగలను ఎత్తుకెళ్లడం, సోలార్ పంపుసెట్ల వద్ద మోటార్లు, వైర్లు చోరీ చేయడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ముందస్తు చర్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. విద్యుత్ శాఖ సిబ్బంది, రైతులు, పోలీసుల మధ్య సమన్వయంతో నేరాలను అరికట్టే విధంగా కార్యాచరణ రూపొందించారు.

**గ్రామస్థాయిలో నిఘా వ్యవస్థ**

ప్రతి గ్రామంలో విద్యుత్ శాఖ సిబ్బంది, లైన్‌మెన్లు, రైతు ప్రతినిధులతో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసి అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా ఉంచాలని నిర్ణయించారు. ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు ఉన్న ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

**స్క్రాప్ వ్యాపారులపై ప్రత్యేక నిఘా**

చోరీకి గురవుతున్న రాగి తీగలు, విద్యుత్ పరికరాలు స్క్రాప్ రూపంలో విక్రయించే అవకాశం ఉన్నందున స్క్రాప్ వ్యాపారుల లావాదేవీలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. చోరీ సామగ్రి కొనుగోలు చేసినట్లు తేలితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**రాత్రి పహారా, సాంకేతిక భద్రతకు ప్రాధాన్యం**

వ్యవసాయ క్షేత్రాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు, సోలార్ పంపుసెట్ల వద్ద రాత్రి వేళల్లో పహారా చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, విద్యుత్ పరికరాల వివరాలను నమోదు చేయడం ద్వారా చోరీలకు పాల్పడిన వారిని గుర్తించడం సులభమవుతుందని వివరించారు.

**సమాచారం అందిస్తే తక్షణ స్పందన**

చోరీలకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే స్పందించేలా ప్రత్యేక పోలీసు బృందాలను అప్రమత్తం చేసినట్లు సీఐ పి. శేషగిరిరావు తెలిపారు. ప్రజల సహకారం, విద్యుత్ శాఖ అప్రమత్తత, పోలీసుల నిఘాతో విద్యుత్ పరికరాల చోరీలను సమర్థవంతంగా అరికట్టవచ్చని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బల్లికురవ ఎస్సై నాగరాజు, సంతమాగులూరు, బల్లికురవ మండలాల విద్యుత్ శాఖ అధికారులు, లైన్‌మెన్లు, హెల్పర్లు, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

# సీఈఐఆర్ టెక్నాలజీతో పోగొట్టుకున్న మొబైల్ రికవరీ..

## వెంటనే ఫిర్యాదు చేస్తే సత్వర న్యాయం బల్లికురవ ఎస్.ఐ నాగరాజు.



**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) జూలై 02:**

ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రజలకు సత్వర సేవలు అందిస్తూ పోలీసులు భరోసా కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా బల్లికురవ మండలంలో పోగొట్టుకున్న ఓ మొబైల్ ఫోన్‌ను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించి బాధితుడికి అప్పగించినట్లు బల్లికురవ ఎస్.ఐ నాగరాజు గురువారం తెలిపారు. ?బల్లికురవ పోలీస్ స్టేషన్ పరిధిలో మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నట్లు అందిన ఫిర్యాదుపై వెంటనే స్పందించిన పోలీసులు, సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్‌ను ట్రేస్ చేశారు. అవసరమైన చట్టపరమైన ప్రక్రియను పూర్తి చేసిన అనంతరం రికవరీ చేసిన ఆ మొబైల్‌ను అసలైన యజమానికి సురక్షితంగా అప్పగించారు. ఎంతో విలువైన తన సెల్‌ఫోన్‌ను తిరిగి అందించిన బల్లికురవ పోలీసుల సత్వర సేవలకు ఈ సందర్భంగా బాధితుడు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

**ఆలస్యం చేయకుండా ఫిర్యాదు చేయండి**

మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వారు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, లేదా సీఈఐఆర్ పోర్టల్‌లో నేరుగా వివరాలు నమోదు చేసుకోవాలని ఎస్.ఐ నాగరాజు సూచించారు. ఎంత త్వరగా ఫిర్యాదు చేస్తే పోయిన మొబైల్‌ను గుర్తించే అవకాశాలు అంతగా పెరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు పారదర్శకమైన, నమ్మకమైన సేవలు అందించడంలో ప్రకాశం జిల్లా పోలీసు యంత్రాంగం ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన పేర్కొన్నారు.

# గిరిజన విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేసిన రెబ్బవరపు మాల్యాద్రి

**కందుకూరు, పెన్ పవర్ జూలై 2:**

గిరిజన పేద విద్యార్థులకు విద్యాభ్యాసంలో ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో కందుకూరు నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) మాజీ డైరెక్టర్ రెబ్బవరపు మాల్యాద్రి విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. కందుకూరు మండలం కొండి కందుకూరు గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో చదువుతున్న 25 మంది గిరిజన పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పలకలు, పెన్సిళ్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రెబ్బవరపు మాల్యాద్రి దాతృత్వాన్ని అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుకుని మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని, సమాజంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని రెబ్బవరపు మాల్యాద్రి ఆకాంక్షించారు. పేద విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు కట్టా సౌందర్య, గ్రామ సచివాలయం ఏఎన్ఎం అరుణతో పాటు గ్రామస్థులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# అమరావతిపై జగన్ విషం కక్కుతున్నారు..
# పిచ్చి చేష్టలు మానకపోతే సున్నాకే పరిమితం.

## టీడీపీ కేంద్ర కార్యాలయం గ్రీవెన్స్‌లో మంత్రి గొట్టిపాటి. రవికుమార్.





**అమరావతి/?అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) జూలై 02:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేయాలనే ఏకైక లక్ష్యంతోనే వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతున్నారని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి. రవికుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం మంత్రి గొట్టిపాటి మీడియాతో మాట్లాడుతూ జగన్ తీరుపై నిప్పులు చెరిగారు.

**రాజధానికి ఇటుక వేయలేదు కానీ.. ప్యాలెస్ నిర్మించుకున్నారు..**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అమరావతి నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతుండటం చూసి ఓర్వలేకనే జగన్ విషం కక్కుతున్నారని మంత్రి విమర్శించారు. గతంలో రాజధానిగా అమరావతిపై తనకు ఎలాంటి వ్యతిరేకత లేదని, రాజధానికి 33 వేల ఎకరాలు కావాలని నాడు మాయమాటలు చెప్పిన వ్యక్తి జగన్ అని గుర్తుచేశారు. ప్రజలను నమ్మించేందుకు అమరావతిలోనే ఇల్లు కట్టుకున్నానని చెప్పి, తీరా అధికారంలోకి రాగానే మూడు రాజధానులంటూ నాటకాలడారని మండిపడ్డారు. ఐదేళ్ల పాలనలో రాజధాని కోసం ఒక్క ఇటుక కూడా పేర్చని జగన్.. తన సొంత సుఖాల కోసం మాత్రం రూ. 450 కోట్లు ప్రజాధనాన్ని ఖర్చుపెట్టి ప్యాలెస్ నిర్మించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**మూడు రాజధానుల పేరుతో మోసం చేసినందుకే 11 సీట్లు..**

మూడు రాజధానుల పేరుతో రాష్ట్ర ప్రజలను మోసం చేసినందుకే గత ఎన్నికల్లో జగన్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పి కేవలం 11 సీట్లకే పరిమితం చేశారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకుండా 'మావిగన్' లాంటి పిచ్చి చేష్టలతో మళ్లీ ఎన్నికలకు వెళితే.. ఈసారి ఆ పార్టీ సున్నాకే పరిమితం కావడం ఖాయమని మంత్రి గొట్టిపాటి జోస్యం చెప్పారు. ఒకవైపు రాష్ట్రంలో పెట్టుబడులు సాధించేందుకు, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు కష్టపడుతుంటే.. జగన్ మాత్రం రాష్ట్రాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్నారని మంత్రి దుయ్యబట్టారు.

# మద్యం మత్తులో దారుణ హత్య







**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 02**
మద్యం మత్తులో బార్బర్ షాప్ లో పనిచేస్తున్న మహేంద్ర అనే 44 సంవత్సరాల వ్యక్తిపై దాడి చేసి హత్య చేసిన సంఘటన నగరంలోని 60 అడుగుల రోడ్డు శ్రీనివాసా హెయిర్ స్టైల్స్ వద్ద చోటుచేసుకుంది. తాలూకా ఇన్స్పెక్టర్ విజయ్ కృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం శ్రీనివాసా హెయిర్ స్టైల్స్ లో గుడివాడకు చెందిన మహేంద్ర అనే వ్యక్తి గత మూడు రోజుల క్రితం పనిచేసేందుకు వచ్చారు. అయితే గురువారం సాయంత్రం సమయంలో కొండేపి మండలం నేతి వారి పాలెం గ్రామానికి చెందిన గోగినేని రామారావు అనే వ్యక్తి పూటుగా మద్యం సేవించి క్షవరం చేయమని షాపుకు రాగా మహేంద్ర అనే వ్యక్తి మద్యం సేవించి ఉన్నావు ఇప్పుడు చేయను తర్వాత రమ్మని చెప్పడంతో రామారావు కోపంగా అతని వద్ద ఉన్న కత్తిని తీసుకొని దాడి చేశారని ఈ దాడిలో మహేంద్ర కు దెబ్బలు తగలడంతో చుట్టుపక్కల వారు రిమ్స్ కు తరలించగా చికిత్స పొందుతూ మరణించారని తెలిపారు. చుట్టుపక్కల వారు రామారావుపై కూడా దాడి చేసినట్లు సమాచారం ఉందని అతను కూడా గాయాలతో రిమ్స్ హాస్పిటల్ లో చేరారని పూర్తి వివరాలు తెలుసుకునేందుకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ తెలిపారు.

# ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసిన శ్రీనివాస వర్మ





**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 2**
పాఠశాల ల అభివృద్ధి కి దాతల సహకారం అవసరమని చింతపూడి నాగులవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి డేవిడ్ అన్నారు. నాగులవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు కేజీబీవీ పాఠశాలలో పదవ తరగతి లో ప్రధమ స్థానం లో నిలిచిన విద్యార్థులులకు ట్రస్ట్ అధినేత గుంటిమడుగు. శ్రీనివాసవర్మ ట్యాబు లను అందచేశారు. అదేవిధంగా నాగులవరం, చింతపూడి, కోమిటిగుంట్ల, కంభంపాడు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు లకు నోట్ బుక్స్, పలకలు, పెన్నులు, కాపీ రైటింగ్ బుక్స్, నాగులవరం హైస్కూల్ విద్యార్థులు లకు జామాత్రీ బాక్స్ లను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జె ప్రసాదరావు , అయా పాఠశాలల ఉపాధ్యాయులు షేక్. పాదుషా, యం. కిరణ్ కుమార్, జి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ యం వసంత కుమార్, టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు పి. కృష్ణ, రిటైర్ టీచర్ హెచ్. వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు రైతులకు మద్దతుగా నేడు వేలం కేంద్రం సందర్శన

**-కాకాణి గోవర్ధన్ రెడ్డి హాజరు -రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని బుర్రా పిలుపు**





**కందుకూరు, పెన్ పవర్ జూలై 2**
పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం కందుకూరు పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించనున్నట్లు కందుకూరు నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు గురువారం విడుదల చేసిన ప్రకటనలో, జూలై 3వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి మాజీ వ్యవసాయ శాఖ మంత్రి, నెల్లూరు జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. పొగాకు రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, గిట్టుబాటు ధర కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ సందర్శన చేపడు తున్నట్లు తెలిపారు. పొగాకు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకురావాలని బుర్రా మధుసూదన్ యాదవ్ కోరారు. అలాగే రైతు నాయకులు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ హోదాల్లో ఉన్న పార్టీ పదాధికారులు, అనుబంధ విభాగాల నాయకులు, అభిమానులు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయుల సమస్యలన్నీ పరిష్కారం

**-ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు -ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణతా శాతం పెంచండి**
**-ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ -2003 డీఎస్సీ ఫోరం ఆధ్వర్యంలో, థాంక్యూ సీఎం సార్ కార్యక్రమం**
**-ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం**




**కందుకూరు పెన్ పవర్, జూలై 2:**
2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు సిపిఎస్ నుంచి విముక్తి కలిగించి, పాత పెన్షన్ విధానానికి కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించిన నేపథ్యంలో 2003 డీఎస్సీ ఫోరం ఆధ్వర్యంలో థాంక్యూ సీఎం సార్ కార్యక్రమాన్ని కందుకూరు పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద గురువారం సాయంత్రం నిర్వహించారు. కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరావు , తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఆధ్వర్యంలో ఇద్దరు నాయకులు కేక్ కట్ చేసి వారికి తినిపించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. థాంక్యూ సీఎం సార్ అంటూ పెద్దగా నినాదాలు చేశారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ 2003 డిఎస్సిలో ఎంపికైన ఉపాధ్యాయులకు ఏడాదిన్నరపాటు పోస్టింగులు ఇవ్వకుండా అప్పటి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఇబ్బంది పెట్టిందన్నారు. చివరకు వారి పోరాటంతో దిగివచ్చి పోస్టింగులు ఇచ్చినా, సిపిఎస్ విధానంలోకి తీసుకువెళ్లారని విమర్శించారు. చంద్రబాబు నాయుడు ప్రస్తుతం పెద్ద మనసుతో ఆలోచించి, సుమారు 11 వేలమంది ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేశారని అన్నారు. అలాగే చంద్రబాబు పాలనలో 8సార్లు డిఎస్సీ ద్వారా వేల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని చెప్పారు. గత ప్రభుత్వం మెగా డీఎస్సీ, ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ అమలు చేస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేసిందని ఎమ్మెల్యే విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందన్నారు. గత ప్రభుత్వంలో సకాలంలో జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉండేదని, ఉపాధ్యాయులను అన్ని విధాలుగా ఇబ్బంది పెట్టారని అన్నారు. ప్రతి సమస్యను పరిష్కరిస్తున్న కూటమి ప్రభుత్వానికి ఉపాధ్యాయులు సహాయ సహకారాలు అందించాలని నాగేశ్వరరావు కోరారు. ఎమ్మెల్సీ శ్రీకాంత్ మాట్లాడుతూ ఓటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయులు పోరాటాలు చేయాల్సిన అవసరం లేదని, ప్రభుత్వమే ముందుకువచ్చి వారి సమస్యలను పరిష్కరిస్తుందని అన్నారు. గత చరిత్రను తిరగేస్తే తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనే ఎక్కువమందికి ప్రభుత్వ ఉపాధ్యాయులుగా అవకాశం కలిగిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పట్ల జగన్ ప్రవర్తించిన తీరును ఎవరూ మరిచిపోరని, కానీ తమ ప్రభుత్వం ఉద్యోగుల పట్ల ఫ్రెండ్లీ ప్రభుత్వమని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు శ్రీకాంత్ వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో గత ఏడాది కంటే ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరాజు, పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, ఏపీఈడబ్ల్యూఐడీ కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు, నిర్వాహకులు జొన్నలగడ్డ వెంకటాద్రి నాయుడు బివిఎల్ ఎన్ మూర్తి, జేజి నారాయణ, జి.శ్రీనివాసులు, తల్లపనేని శ్రీనివాసులు, నవులూరి పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

# సర్ వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి

## ఆర్డిఓ తోట అజయ్ కుమార్



**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 2**
ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఏఆర్) వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, నిర్దేశించిన గడువులోగా పూర్తిచేయాలని కనిగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి తోట అజయ్ కుమార్ బిఎల్ఓ లకు సూచించారు.మండలంలోని సి ఎస్ పురం, పెద్దరాజుపాలెం గ్రామాల్లో కొనసాగుతున్న ఎస్ఏఆర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్ వోలు) చేపడుతున్న ఇంటింటి పరిశీలన తీరును పరిశీలించి, నమోదు వివరాలపై ఆరా తీశారు.అనంతరం బీఎల్వోలతో మాట్లాడుతూ ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. వెరిఫికేషన్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు, నిర్లక్ష్యానికి తావు లేకుండా విధులు నిర్వహించాలని తెలిపారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, సర్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా వెరిఫికేషన్ నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కె ధర్మ తేజ, మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్, రెవెన్యూ శాఖ సిబ్బంది , బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

# వెస్ట్ జోన్‌లో జూలై 15న దుకాణాల బహిరంగ వేలం



**విశాఖపట్నం, పెన్ పవర్ జూలై 2**
మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ (జీవీఎంసీ) వెస్ట్ జోన్ పరిధిలో ఖాళీగా ఉన్న దుకాణాలు, హాకర్ జోన్ షాపులు, రోడ్‌సైడ్ మార్కెట్లను గుత్తకు ఇచ్చేందుకు జూలై 15న ఉదయం 11 గంటలకు వెస్ట్ జోన్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ బి. హేమావతి తెలిపారు. వార్డు నెం.60లోని గుల్లలపాలెం షాపింగ్ కాంప్లెక్స్, ములగాడ షాపింగ్ కాంప్లెక్స్, ప్రకాష్ నగర్ షాపింగ్ కాంప్లెక్స్‌లలో ఖాళీగా ఉన్న దుకాణాలతో పాటు గుల్లలపాలెం హాకర్ జోన్‌లోని పలు షాపులను మూడు సంవత్సరాల కాలపరిమితికి గుత్తకు ఇవ్వనున్నారు. అలాగే గుల్లలపాలెం రోడ్‌సైడ్ మార్కెట్లను (హాకర్ మండలం) ఒక సంవత్సరం కాలపరిమితికి వేలం ద్వారా కేటాయించనున్నారు. వేలంపాటలో పాల్గొనదలచిన వారు ధరావత్తు మొత్తాన్ని డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ) రూపంలో తీసుకురావాలని అధికారులు సూచించారు. ఎస్సీ రిజర్వు కేటగిరీకి చెందిన వారు సంబంధిత కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. అలాగే ప్రతి పాల్గొనేవారు ఆధార్, పాన్ కార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు. వేలానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం కార్యాలయ పనిదినాల్లో జీవీఎంసీ వెస్ట్ జోన్ కార్యాలయంలోని సంబంధిత అధికారులను సంప్రదించాలని జోనల్ కమిషనర్ సూచించారు.

# బీఎల్‌ఏలే కాంగ్రెస్ బలోపేతానికి వెన్నెముక: పాచిపెంట శాంతకుమారి

**విజయనగరం, పెన్ పవర్ జూలై 2**
విజయనగరం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన బీఎల్‌ఏల సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాచిపెంట శాంతకుమారి మాట్లాడుతూ, గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తూ ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఏఐసీసీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ పాలక్ వర్మ మాట్లాడుతూ, ఓటరు జాబితాలో అక్రమాలు జరగకుండా బీఎల్‌ఏలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ ప్రజా ఉద్యమాలకు సంబంధించిన ప్రత్యేక క్యూ ఆర్ కోడ్‌ను విడుదల చేశారు. అనంతరం ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలపై బీఎల్‌ఏలకు అవగాహన కల్పించారు.

# వైభవ్ సూర్యవంశీని ఆడించాల్సింది.. ప్యాంట్లు ఊడగొట్టేవాడు: రవిశాస్త్రి



భారత జట్టు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని ఐర్లాండ్ పర్యటనలో తుది జట్టులోకి తీసుకోకపోవడంపై టీమిండియా మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇండియన్ టీమ్ లోకి తొలిసారి పిలుపు అందుకున్న 15 ఏళ్ల వైభవ్, వరుసగా మూడు మ్యాచ్‌ల్లోనూ బెంచ్‌కే పరిమితం కావడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓపెనర్లు సంజు శాంసన్, అభిషేక్ శర్మలు అద్భుత ఫామ్‌లో ఉండటంతో ఈ నిర్ణయం సమర్థనీయమే అయినప్పటికీ, ఐర్లాండ్ సిరీస్‌లో భారత బ్యాటింగ్ ఘోరంగా విఫలమై 2--0తో సిరీస్ ఓడిపోయింది.

**అతడ్ని బెంచ్‌పై కూర్చోబెడతారా?:**

గత 12 నెలలుగా వైభవ్ సూర్యవంశీ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడని రవిశాస్త్రి గుర్తు చేశారు. ముఖ్యంగా ఐపీఎల్‌లో ప్రపంచ స్థాయి బౌలర్లను సైతం చితక్కొడుతూ ఏకంగా 776 రన్స్ సాధించి ఆరెంజ్ క్యాప్‌ను సొంతం చేసుకున్నాడని పేర్కొన్నారు. అంతటి ఫామ్‌లో ఉన్న ప్లేయర్‌ను ఐర్లాండ్ టూరులో ఆడించి ఉంటే, అక్కడి చిన్న మైదానాల్లో ప్రత్యర్థి బౌలింగ్‌ను ముక్కలు ముక్కలు చేసేవాడని రవిశాస్త్రి అభిప్రాయపడ్డారు.

**రవిశాస్త్రి తనదైన శైలిలో కామెంట్స్:**

ఐర్లాండ్ సిరీస్‌లోనే వైభవ్ సూర్యవంశీ కచ్చితంగా ఆడాల్సింది.. అక్కడ పిచ్‌లు చాలా స్లోగా, స్పాంజీగా ఉన్నాయి, పైగా గ్రౌండ్ కూడా చాలా చిన్నది.. అతను గనుక బరిలోకి దిగి ఉంటే బంతిని స్టేడియం బయటకి బాదేవాడు.. ప్రత్యర్థి బౌలర్ల ప్యాంట్లు ఊడదీసేలా ఆడి ఉండేవాడని పేర్కొన్నాడు. ఇప్పుడు ఇంగ్లాండ్ సిరీస్‌లో అతనికి అవకాశం ఇస్తారో లేదో నాకు తెలియదు.. కానీ అతనికి వీలైనంత త్వరగా జట్టులో ఛాన్స్ ఇవ్వాలి.. ఐపీఎల్‌లో అతను ఏ ఫాస్ట్ బౌలర్‌ను వదిలిపెట్టలేదు.. అలాంటి ఆటగాడిని తెచ్చి మీరు బెంచ్ పై కూర్చోబెడతారా? అని మండిపడ్డాడు.

**అతనే టీమిండియా ఎక్స్-ఫ్యాక్టర్:**

వైభవ్ సూర్యవంశీ భారత జట్టుకు ఒక ఎక్స్-ఫ్యాక్టర్.. అతని కోసం జట్టులో ఎలాగైనా స్థానం కల్పించాలని రవిశాస్త్రి మేనేజ్‌మెంట్‌కు సూచించారు. కేవలం 15 ఏళ్ల వయసున్న వైభవ్‌కు ఎలాంటి ముందస్తు అంచనాల ఒత్తిడి, యువ రక్తం కావడంతో అతను మైదానంలో నిర్భయంగా ఆడతాడని కొనియాడారు. అతను గనుక క్రీజులో నిలదొక్కుకుని మొదటి 2, 3 ఓవర్లు ఆడితే, మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు భారీ స్కోర్లు చేయడానికి అవసరమైన బలమైన పునాదిని ఓపెనింగ్‌లోనే అందిస్తాడని రవిశాస్త్రి గట్టిగా చెప్పారు.

# కరీంనగర్ డైమండ్స్ అదిరిపోయే కమ్‌బ్యాక్.. రంగారెడ్డిపై 58 రన్స్ తేడాతో విజయం



టీజీ20 లీగ్ 2026 ప్రారంభంలో వరుసగా రెండు మ్యాచుల్లో ఓడిపోయిన కరీంనగర్ డైమండ్స్ జట్టు ఇప్పుడు టోర్నమెంట్‌లో దూసుకుపోతుంది. ఈరోజు (జులై 2న, గురువారం రంగారెడ్డి రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కరీంనగర్ జట్టు 58 పరుగుల భారీ తేడాతో విక్టరీ సాధించింది. ఈ లీగ్‌లో వరుసగా మూడో విజయాన్ని ఖాతాలో వేసుకున్న కరీంనగర్ డైమండ్స్, పాయింట్ల పట్టికలో ఏకంగా రెండో స్థానానికి దూసుకెళ్లి రచ్చ లేపింది.

**కరీంనగర్ బ్యాటర్ల ఊచకోత:**

ఈ మ్యాచ్‌లో టాస్ ఓడిపోయి మొదట బ్యాటింగ్‌కు దిగిన కరీంనగర్ డైమండ్స్ బ్యాటర్లు రంగారెడ్డి బౌలర్లపై చెలరేగిపోయారు. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి ఏకంగా 230 పరుగులని స్కోరుబోర్డుపై పెట్టారు. ఇక కరీంనగర్ బ్యాటర్లలో రాహుల్ రాడేశ్ (37 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 72 రన్స్ ), నఖ సింహ (38 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 60 పరుగులు) హాఫ్ సెంచరీలతో కిరాక్ ఇన్నింగ్స్ ఆడారు. వీరిద్దరి జోడీ మూడో వికెట్‌కు ఏకంగా 123 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టు భారీ స్కోరు చేయడంలో కీ రోల్ పోషించింది. ఓపెనర్లు సాత్విక్ రెడ్డి (13 బంతుల్లో 24), తన్మన్ అగర్వాల్ (16 బంతుల్లో 29) పర్వాలేదనిపించగా, చందన్ సహాని 19, శుభమ్ శర్మ 17లి రన్స్ చేశారు. కాగా రంగారెడ్డి బౌలర్లలో తనయ్ జడ్డూ 2 వికెట్లు తీసుకోగా.. నితిన్ సాయి యాదవ్, తనయ్ త్యాగరాజన్ చెరో వికెట్ పడగొట్టారు.

**చేతులెత్తేసిన రంగారెడ్డి రైజర్స్ బ్యాటర్లు:**

231 రన్స్ లక్ష్యంతో బరిలోకి దిగిన రంగారెడ్డి రైజర్స్ జట్టు కరీంనగర్ బౌలర్ల ధాటికి తట్టుకోలేక నిర్ణీత 20 ఓవర్లలో 172/9 పరుగులకే పరిమితమై ఓటమి పాలైంది. రంగారెడ్డి బ్యాటర్లలో ఆదిత్య జవ్వాజి (31 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 48 పరుగులు) టాప్ స్కోరర్‌గా నిలిచినప్పటికీ జట్టును మాత్రం గెలిపించలేకపోయాడు. జ్ఞాన ప్రకాష్ రెడ్డి (23), ఆరోన్ జార్జ్ (19), నితిన్ సాయి యాదవ్ (15) తక్కువ రన్స్ కే ఔట్ కాగా.. చివర్లో ఆర్యన్ కరియప్ప (20 బంతుల్లో 30లి) కాస్త దూకుడుగా ఆడినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. దీంతో 58 పరుగుల తేడాతో కరీంనగర్ డైమాండ్స్ చేతిలో రంగారెడ్డి ఓడిపోయింది.

# శ్రీలంకతో భారత్ టెస్ట్ సిరీస్.. తేదీలు, టైమింగ్స్ ప్రకటించిన బీసీసీఐ!



భారత క్రికెట్ జట్టు ఆగస్టు మాసంలో శ్రీలంకలో పర్యటించనుందని లంక క్రికెట్ బోర్డు అధికారికంగా ప్రకటించింది. 2025--2027 ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో భాగంగా ఈ రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ జరగనుంది. భారత కాలమానం ప్రకారం ఉదయం 10:00 గంటలకు ప్రారంభమయ్యే ఈ సిరీస్‌లో మొదటి టెస్ట్ మ్యాచ్ ఆగస్టు 15 నుంచి 19 వరకు గాలే ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరగనుంది. ఆ తర్వాత రెండో టెస్ట్ మ్యాచ్ ఆగస్టు 23 నుంచి 27 వరకు కొలంబోలోని సింహాళీస్ స్పోర్ట్స్ క్లబ్ (రాజ) గ్రౌండ్‌లో నిర్వహిస్తారు.

**డబ్ల్యూటీసీ ఫైనల్ రేస్.. శ్రీలంకకు ప్రతి మ్యాచ్ అత్యంత కీలకం:**

గతంలో రెండుసార్లు వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరినా టైటిల్ గెలవలేకపోయిన భారత జట్టు ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో కొనసాగుతుండగా.. శ్రీలంక ఆరో స్థానంలో ఉంది. వచ్చే ఏడాది జరగబోయే డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరడానికి శ్రీలంకకు కేవలం 5 నుంచి10 శాతం అవకాశాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. దాంతో హోమ్ గ్రౌండ్‌లో జరగబోయే ఈ సిరీస్‌లో లంక జట్టు ఏ చిన్న తప్పు చేసినా ఫైనల్ రేస్ నుంచి పూర్తిగా తప్పుకోవాల్సి వస్తుంది.

**గిల్ సేనకు కమ్‌బ్యాక్ ఛాన్స్.. స్పిన్ పిచ్‌లపై అసలైన పరీక్ష:**

శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో ఇంగ్లాండ్‌తో 2- 2 తేడాతో సిరీస్ డ్రా చేసుకోవడం, వెస్టిండీస్‌పై హోమ్ సిరీస్ గెలవడంతో గిల్ ఎరా బాగానే ప్రారంభమైంది. కానీ, గత ఏడాది సౌతాఫ్రికా చేతిలో స్వదేశంలో క్లీన్ స్వీప్ ఓటమి భారత జట్టు అవకాశాలని దెబ్బతీసింది. ముఖ్యంగా స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో భారత బ్యాటర్ల వైఫల్యం, అలాగే మన స్పిన్ విభాగంలో పస తగ్గడం లాంటి లోపాలు ఆ సిరీస్‌లో స్పష్టంగా బయటపడ్డాయి. ఐపీఎల్ లో ఉండే ఫ్లాట్ పిచ్‌లు, టెస్ట్ మ్యాచ్‌లకు ముందు తగినంత ప్రాక్టీస్ సమయం లేకపోవడమే ఇండియన్ బ్యాటర్లు స్పిన్‌కు ఇబ్బంది పడటానికి ప్రధాన కారణాలుగా మారుతుండగా, ఇప్పుడు శ్రీలంక పిచ్‌లపై లంక స్పిన్నర్లను తట్టుకుని నిలబడటం గిల్ సేనకు అతిపెద్ద సవాల్ కానుంది.

# సింప్లిసిటీనే బ్యూటీ... అమైరా దస్తూర్ ఎలిగెంట్ లుక్ వైరల్!

ఫిలిం ఇండ్రస్ట్రీలో మూడు భాషల్లో సినిమాలు చేస్తూ, తన టాలెంట్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ అందాల తార అమైరా దస్తూర్. నటనతోనే కాకుండా తన అదిరిపోయే ఫ్యాషన్ సెన్స్‌తో కూడా ఈ ముద్దుగుమ్మ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. తాజాగా ఆమె సాంప్రదాయ లుక్‌లో చేసిన ఒక సాఫ్ట్ అండ్ క్లాసిక్ ఫోటోషూట్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. మోడరన్ డ్రెస్సుల్లోనే కాకుండా ట్రెడిషనల్ చీరకట్టులోనూ ఆమె అందం నెక్స్ట్ లెవెల్‌లో ఉందంటూ ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు.

**లావెండర్ ఆర్గాంజా శారీలో మెరిసిన భామ:**

ఈ లేటెస్ట్ ఫోటోషూట్‌లో అమైరా దస్తూర్ 'హౌస్ ఆఫ్ సుహి' ఫ్యాషన్ బ్రాండ్‌కు చెందిన లైట్ లావెండర్ కలర్ ఆర్గాంజా శారీ కట్టుకుంది. ఇక ఎంతో సున్నితంగా, సింపుల్ మిర్రర్ వర్క్ డిజైన్‌తో ఉన్న ఈ పారదర్శక చీరలో ఆమె చాలా ఎలిగెంట్‌గా కనిపిస్తోంది. భారీ డిజైన్లు లేకుండా ఎంతో సింపుల్‌గా ఉన్నా.. ఆమె రాయల్ లుక్ మాత్రం అందరినీ కట్టిపడేస్తోంది.

**పర్ఫెక్ట్ మ్యాచ్.. స్లీవ్‌లెస్ బ్లౌజ్ మరియు గాజులు:**

ఈ లైట్ కలర్ చీరకు కాంట్రాస్ట్‌గా ఉండేలా ఐమైరా డీప్ పర్పుల్ కలర్ స్లీవ్‌లెస్ బ్లౌజ్‌ను మ్యాచ్ చేసింది. ఈ కలర్ కాంబినేషన్ ఆమె లుక్‌ను మరింతగా ఎలివేట్ చేసింది. ఇక దీనికి తోడు చేతులకు వేసుకున్న మ్యాచింగ్ పర్పుల్ కలర్ గాజులు ఆ లుక్‌కు పర్ఫెక్ట్ ట్రెడిషనల్ టచ్ ఇచ్చాయి. ఆభరణాల విషయంలో కూడా ఎక్కువ హడావుడి లేకుండా కేవలం ఆక్సిడైజ్డ్ జుంకాలు మాత్రమే పెట్టుకుంది.



**అన్ని భాషల్లోనూ అదరగొడుతున్న అమైరా:**

అమైరా దస్తూర్ కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా విభిన్నమైన క్యారెక్టర్స్ చేస్తూ దూసుకుపోతోంది. క్రైమ్ డ్రామా సిరీస్ 'బంబాయి మేరి జాన్', తమిళ థ్రిల్లర్ 'బఘీరా' లలో తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. అంతేకాదు, పంజాబీ రొమాంటిక్ డ్రామా 'పుర్తీలా' తో రీజనల్ మార్కెట్‌లోనూ హిట్ కొట్టింది. నటిగానే కాకుండా తన సొంత ఫ్యాషన్ వెంచర్స్‌తో బిజినెస్ ఉమన్‌గానూ రాణిస్తోంది.

**నెట్‌ఫ్లిక్స్ 'చుంబక్' పై భారీ ఆశలు:**

ప్రస్తుతం అమైరా దస్తూర్ నెట్‌ఫ్లిక్స్ లో రాబోతున్న మోస్ట్ అవేటెడ్ మల్టీస్టారర్ కామెడీ డ్రామా 'చుంబక్' సినిమాలో నటిస్తోంది. ఇక ఈ క్రేజీ ప్రాజెక్ట్ తో ఓటీటీలో మరో పెద్ద సక్సెస్ అందుకోవాలని చూస్తోంది. ఒకవైపు సినిమాలు చేస్తూనే, మరోవైపు ఇలాంటి లవ్లీ ఫోటోషూట్స్‌తో సోషల్ మీడియాలో తన ఫాలోయింగ్‌ను భారీగా పెంచుకుంటోంది.

అటు మోడరన్ లుక్స్, ఇటు ట్రెడిషనల్ స్టైల్.. ఏదైనా సరే అమైరా దస్తూర్ చాలా ఈజీగా క్యారీ చేయగలదని ఈ ఫొటోలతో మరోసారి ప్రూవ్ అయ్యింది. ఇక సింప్లిసిటీనే అసలైన బ్యూటీ అని నిరూపిస్తున్న ఈ లావెండర్ శారీ లుక్ ఇప్పుడున్న యంగ్ గర్ల్స్‌కు ఒక పర్ఫెక్ట్ ఫ్యాషన్ ఇన్స్పిరేషన్ అని చెప్పొచ్చు.





Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com